ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శనివారం 27 జూలై 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 30.0
కనిష్ఠం : 26.0

పోలంగట్టు తగాదా..హత్య 7


ముసునూరు నుంచి ఆటోలో తరలిస్తున్న వరినారు

ఎకరా వరి నారు రూ.2వేలు

- వరదలతో పెరిగిన డిమాండ్
- రైతులపై అదనపు పెట్టుబడి భారం

చింతలపూడి, జూలై 26 : మెట్టప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రైతులు వరినాట్లకు సిద్ధమయ్యారు. అధిక వర్షాల వల్ల నారుమడులు నీటిలో మునిగి కుళ్ళిపోగా కొన్నిచోట్ల వరినాట్లు వేసిన పొలాలు ముంపునకు గురై నాట్లు కొట్టుకుపోయాయి. తిరిగి వరి నాట్లు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎకరా నారు ధర రూ.2వేలు కాగా, దాని ఆటోలో తరలించి తిరిగి నాట్లు వేసుకోవడానికి మరో రూ.4వేలు ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. భారీ వర్షాల, వరదలకు ముందు ఎకరా నారు రూ.వెయ్యికు లభ్యమయ్యేది. ప్రస్తుతం ధర రెట్టింపైనా నారు దొరకడం లేదు. మండలంలో ఇప్పటివరకు 40 శాతం మాత్రమే వరినాట్లు పడ్డాయి. మరోవైపు వెదజల్లే విధానంలో వేసిన వరికి కలుపు బెడద వేధిస్తోంది. ఇప్పటికే రెండుసార్లు కలుపు మందు పిచికారీ చేసినా ఉపయోగం లేదని రైతులు వాపోతున్నారు. మెరకప్రాంత గ్రామాల్లోకి వెళ్ళి గొట్టపుబావులు కింద వేసివున్న నారును కొనుగోలు చేసి తీసుకొస్తున్నారు. వేలేరుపాడు వద్ద పెదవాగు ప్రాజెక్టుకు గండి పడటంతో అక్కడ నాట్లు పాడై తెలంగాణ ప్రాంతంలోని వినాయకపురం, తదితర గ్రామాల నుంచి రైతులు నారు కొనేందుకు ఇక్కడి ప్రాంతాలకు తరలివస్తున్నారు. చింతలపూడి, ముసునూరు తదితర ప్రాంతాల్లో నారు దొరికితే ముందస్తుగానే అడ్వాన్స్‌లు ఇస్తున్నారు. నారు అందుబాటులో ఉంటే సొమ్ము చెల్లించి ఆటోల్లో తరలిస్తున్నారు. మరోవైపు నాట్లు వేసేందుకు కూలీలు దొరకడం లేదని రైతులు వాపోతున్నారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీలో..
ఏం జరుగుతోంది?
విద్యా సంస్థలోకి రాజకీయాల చొరబాటు





- మంత్రి లోకేశ్ ప్రత్యేక దృష్టి

నూజివీడు ట్రిపుల్ ఐటీలో జరుగుతున్న అరాచకాలు, సమస్యలను వివరిస్తూ విద్యార్థులు ట్విటర్ ఎక్స్ వేదికగా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకుని వెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన 'నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్య నా దృష్టికి వచ్చింది. ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని నా చెల్లెళ్లు, తమ్ముళ్లకు హామీ ఇస్తున్నాను. విద్యార్థుల చదువు, ఆరోగ్యం వారి భద్రతే మా మొదటి ప్రాధాన్యత. మీ బంగారు భవిష్యత్‌కు నాదీ బాధ్యత' అంటూ స్పందించారు. అనంతరం అసెంబ్లీ సమావేశాల సాక్షిగా విద్యా శాఖ అధికారులకు సుతిమెత్తగా హెచ్చరికలు జారీచేశారు. గత ప్రభుత్వం వ్యవస్థలను భ్రష్టు పట్టించింది. అధికారులలో బాధ్యత లేకుండా పోయింది. నేను చెబితేనే భోజన నాణ్యతలో మార్పులు వస్తున్నాయి. నెల రోజులు సమయం ఇస్తున్నా. గాడి తప్పిన వాటిని గాడిలో పెట్టాలి. ఇకపై నేను ప్రత్యేక దృష్టి పెట్టి పర్యవేక్షిస్తా' అంటూ స్పష్టం చేశారు.

- ఉన్నతాధికారుల రాజీనామాలతో కరువైన పర్యవేక్షణ
- దారి తప్పుతున్న విద్యార్థులు.. దాడులు, మందు పార్టీలతో హల్‌చల్
- సిబ్బంది నియామకంలోనూ పెరిగిన రాజకీయ జోక్యం

నూజివీడు టౌన్, జూలై 26 : గ్రామీణ స్థాయి విద్యార్థులకు ప్రపంచస్థాయి సాంకేతిక విద్యను అందించాలనే సదాశయంతో రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీలు 2008లో ప్రారంభించారు. అందులో ఒకటి నూజివీడు ట్రిపుల్ ఐటీ. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం పుణ్యమా అని ఈ సంస్థ ప్రతిష్ఠ మసకబారుతోంది. నిరంతరం పర్యవేక్షిం చాల్సిన ఉన్నతాధికారులు తమ విధులకు రాజీనామా చేశామంటూ తమపై వున్న బాధ్యతను పట్టించుకోవడం లేదు. తమకు సంబంధం లేదనేలా వ్యవహరించడంతో ఇక్కడ అసాంఘిక కార్యక్రమాలకు వేదికగా మారింది. ప్రధానంగా సెక్యూరిటీ లోపాలతో విద్యార్థులకు మద్యం సరఫరా అవడంతో మత్తులో విద్యార్థులు పరస్పరం దాడులకు దిగి, గాయపరచుకున్న సంఘటనలు ఇటీవల తరచూ చోటు చేసుకుంటున్నాయి. టెక్ జెట్ సాక్షిగా విద్యార్థులు మద్యం సేవించి దాడులకు దిగిన ఘటనలు మరువకముందే పది రోజుల క్రితం పుట్టిన రోజుల వేడుకల ముసుగులో ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న కొందరు క్యాంపస్‌లో వారు వసతి పొందుతున్న ఈలోగా మద్యం సేవించడం మత్తులో ఫుడ్ కోర్టు సమీపంలో ఒక విద్యార్థినితో అసభ్య ప్రవర్తన తృతీయ ఏడాది విద్యార్థులతో ఘర్షణ పడిన ఘటనలు ఆలస్యంగా వెలుగుచూశాయి. దీంతో ప్రత్యేక కమిటీ వేసిన అధికారులు సంబంధిత విద్యార్థుల తల్లిదండ్రులను పిలిచి వారిని మూడు నెలలపాటు సస్పెండ్ చేశారు.

బాధ్యులు మీరే

పదో తరగతి పూర్తవగానే విద్యార్థులను ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ విద్య కోసం ట్రిపుల్ ఐటీలో చేర్పించి మీకు అప్పగించాం. రెసిడెన్షియల్ విధానంలో సాగుతున్న సంస్థలోకి మద్యం ఎలా వచ్చిందంటూ ఘర్షణకు దిగిన విద్యార్థుల తల్లిదండ్రులు ట్రిపుల్ ఐటీ అధికారులను ప్రశ్నిస్తూ ఆగ్రహం వ్యక్తం చేయడంతో ప్రత్యేక కమిటీలోని అధికారులు కంగుతిన్నారు. దాడుల విషయం పోలీసుల వరకు వెళితే పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని క్రమశిక్షణా చర్యలతోనే సరిపెడుతున్నామంటూ అధికారులు విద్యార్థుల తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.

పెచ్చు మీరుతున్న రాజకీయ ప్రమేయం

నూజివీడు ట్రిపుల్ ఐటీలో రాజకీయ ప్రమేయం నానాటికి పెరుగుతోంది. నాన్ టీచింగ్, సెక్యూరిటీ సిబ్బంది నియామకాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రమేయం ఉండటంతో అవాంఛనీయ ఘటనలు జరిగిన సమయంలో వారిపై పల్లెత్తు మాట అనలేని పరిస్థితి. దీంతో విద్యార్థుల రక్షణకు సంబంధించి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కమిటీలకు తిలోదకాలు ఇచ్చిన గత ప్రభుత్వం

ఆర్జీయూకేటీ స్టూడెంట్ వెల్ఫేర్‌లో భాగంగా భద్రతా సంక్షేమం వంటి వాటి పర్యవేక్షణకు కమిటీలు ఏర్పాటు చేయాలి. గత టీడీపీ ప్రభుత్వంలో కమిటీలో పర్యవేక్షణ సాగగా వైసీపీ ప్రభుత్వంలో మాత్రం కమిటీలకు తిలోదకాలు ఇచ్చారనే ఆరోపణలు వున్నాయి. ప్రధానంగా భద్రతా కమిటీల్లో ఒక సీఐ ర్యాంకు అధికారితోపాటు సైకాలజిస్టును నియమించాలి. దాడులు, ఆత్మహత్యలు వంటి ఘటనలు జరిగినప్పుడు కౌన్సెలింగ్ నిర్వహించాలి. ఇందుకు సంబంధించి సీఐ, సైకాలజిస్టులను డిప్యూటేషన్‌పై నియమించుకునే వారైతే గత వైసీపీ ప్రభుత్వంలో సీఐ, సైకాలజిస్టుల డిప్యూటేషన్‌కు ఆర్జీయుకేటీ విధి విధానాలను నిర్ణయించే గవర్నింగ్ కౌన్సిల్ అంతగా సుముఖత చూపకపోవడంతో ఈ కమిటీలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. ఫలితంగా నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మద్యం మత్తులో దాడులు వంటివి చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు వున్నాయి. వాటిని అరికట్టాల్సిన అధికారులు ఇటువంటి ఘటనలు బయటకు వెళితే సంస్థ రెఫిటేషన్ దెబ్బ తిని, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు అవరోధం కలుగుతుందని ఘటనలను కప్పి పుచ్చుతున్నారే తప్ప సంస్థ ప్రతిష్ఠ దెబ్బ తింటుందనే ఆలోచన చేయడం లేదు. ట్రిపుల్ ఐటీల ప్రతిష్ఠ దెబ్బ తినడానికి గత ప్రభుత్వ విధానాలు ఒక విధంగా కారణమైతే ఆ ప్రభావం ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై పడుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ట్రిపుల్ ఐటీలను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అసలు లోపమెక్కడ ?

నూజివీడు ట్రిపుల్ ఐటీలో జరుగుతున్న అవాంఛనీయ ఘటనలకు ప్రధాన లోపం ఎక్కడనే అంశంపై చర్చ జరుగుతోంది. పరిపాలన బాధ్యతలు చూడాల్సిన డైరెక్టర్ సహా ఉన్నత స్థాయి అధికార వర్గం ఇటీవల వారి పదవులకు రాజీనామా చేశారు. దీంతో వీరు తమ విధులపై అంతగా శ్రద్ధ చూపడం లేదు. మరోవైపు డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అధికారి ఇక్కడ విధులకన్నా ఓడీల పేరుతో బయటే ఎక్కువగా ఉన్నారని ఫలితంగా ట్రిపుల్ ఐటీపై పట్టు సాధించలేకపోయారని కొందరు సిబ్బంది అంతర్గతంగా వ్యాఖ్యానిస్తున్నారు. చివరికి అడ్మిషన్ల ప్రక్రియలో అంతగా డైరెక్టర్ పాల్గొనలేదని ఆరోపణలు వచ్చాయి.

పెరుగుతూ..తగ్గుతూ


వేలేరుపాడు-రుద్రమకోట రహదారిపై గోదావరి వరద

- దోబూచులాడుతున్న గోదావరి
- ముంపు గ్రామాల్లో తొలగని వరద భయం
- కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో కలెక్టర్, జేసీ పర్యటన
- వరద సహాయక కార్యక్రమాల పరిశీలన

కుక్కునూరు/వేలేరుపాడు/పోలవరం/బుట్టాయగూడెం, జూలై 26 : ఏజెన్సీలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు ఇంకా గోదావరి వరద భయం వీడలేదు. గురువారం రాత్రి ఎనిమిది గంటలకు 48 అడుగులు నీటిమట్టం చేరుకోవడంతో భద్రాచలం వద్ద రెండో ప్రమాదహెచ్చరిక జారీ చేశారు. శుక్రవారం ఉదయం ఐదు గంటలకు నెమ్మదిగా తగ్గుతూ 47.06 అడుగులకు చేరుకుంది. సాయంత్రం ఆరు గంటలకు తిరిగి పెరుగుతూ 47.3 అడుగులకు చేరుకుంది. ఎగువ ప్రాంతం నుంచి ఇంకా వరద ప్రభావం ఉండడంతో శుక్రవారం రాత్రికి మళ్లీ రెండో ప్రమాద హెచ్చరిక 48 అడుగులకు చేరుకుంటుందని సీడబ్ల్యూసీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువ వరదను దృష్టిలో ఉంచుకుని గోదావరి నీటిమట్టం 49 అడుగుల వరకు చేరుకుని మరలా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.

భయపెడుతున్న గోదారి

వరద కారణంగా వేలేరుపాడు మండలంలోని 30 గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకోగా 2,538 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 2021-22 సంవత్సరాల్లో గోదావరి నది తగ్గుతూ పెరుగుతూ ఇప్పటిలాగే దోబూచులాడి 2022 జూలై 15న గోదావరి నదికి 21లక్షల క్యూసెక్కుల పైనే వరద వచ్చిపడడంతో భద్రాచలం వద్ద 71.3 అడుగులకు చేరుకోగా మండలంలోని 41 గ్రామాల్లో ఇళ్ళు నీటమునిగి భారీ ఆస్తి నష్టం జరిగింది. తిరిగి అదేమాదిరిగా ఇప్పటికే ఈ వారంలో గోదావరి మూడుసార్లు పెరిగి మండల ప్రజలను భయాందోళనకు గురి చేస్తోంది. మండల ప్రజలు పాత రోజులను గుర్తు చేసుకుంటూ మరలా ఏ ఉపద్రవం వచ్చి పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. దీనికి ఊతం ఇస్తూ తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టు అనుబంధ బ్యారేజీల నుంచి వరదనీటిని దిగువన ఉన్న గోదావరిలోకి వదిలేస్తున్నారు. గోదావరి ఉపనదులు పొంగి పొర్లుతూ వరద పోటెత్తుతోంది. ఇంకోవైపు మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదారికి వరద పోటెత్తే ప్రమాదం పొంచిఉంది. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని కలెక్టర్‌తో పాటు జిల్లా స్థాయి అధికారులు మొత్తం వేలేరుపాడు, కుక్కునూరు మండలాల పైనే దృష్టి సారించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. కుక్కునూరు మండలం దాచారం, తెల్లరాయిగూడెం, కౌండిన్యముక్తి పునరావాస కేంద్రాలను అధికారులు సందర్శించి బాధితులకు నిత్యావసర సరుకులు కూరగాయలు అందజేస్తున్నారు.

నేడు మంత్రుల పర్యటన

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పెద్దవాగు, గోదావరి వరద బాధితులను పరామర్శించడానికి రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, నిమ్మల రామానాయుడు శనివారం రానున్నారు. ముంపు గ్రామాలైన వేలేరుపాడు మండలం మేడేపల్లి, అల్లూరినగర్, కోయమాదారం, భూదేవిపేట, కన్నాయిగుట్ట, తిరుమలాపురం, కుక్కునూరు మండలం దాచారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పర్యటించి బాధితులను కలసి ధైర్యం చెప్పనున్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు : కలెక్టర్

వరద బాధితులకందించే సహాయ కార్యక్రమాలు సక్రమంగా చేయాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలను తప్పవని కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో అమలవుతున్న వరద సహాయ కార్యక్రమాలను జేసీ ధాత్రితో కలిసి శుక్రవారం పరిశీలించారు. కుక్కునూరు మండలం దాచారం పునరావాస కాలనీని సందర్శించి నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'వరద సహాయక కేంద్రాలకు తరలించిన ప్రజలకు నాణ్యమైన భోజనం అందించాలి. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, పిల్లలకు పాలు, ఇవ్వాలి. ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్న కుటుంబాలకు టార్పాలిన్లు అందించాలి. విద్యుత్ సౌకర్యాన్ని వీలున్నంత వరకు వెంటనే పునరుద్ధరించాలి' అని ఆదేశించారు. శివకాశీపురం ఆశ్రం పాఠశాలలోని పునరావాస కేంద్రాన్ని, భూదేవిపేట కస్తూరిబా పాఠశాలలోని పునరావాస కేంద్రాన్ని సందర్శించి, నిర్వాసితులతో మాట్లాడి సహాయ పునరావాస కార్యక్రమాలపై ఆరా తీశారు. జేసీ ధాత్రి, ఆర్డీవో అద్దయ్య, ఇతర అధికారులతో కలిసి పడవపై తిరుమలాపురానికి వెళ్ళి గ్రామస్థులతో మాట్లాడారు. జిల్లాలో వరద సహాయక కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు కోట్లు కేటాయించిందని ప్రతీ కుటుంబానికి ఐదు కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అరకిలో వంటనూనె, ఐదు రకాల కాయగూరలు అందిస్తున్నామని అవన్నీ సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. గోదావరి చుట్టుముట్టిన తూర్పుమెట్టకు వెళ్ళేందుకు వీలు కాకపోవడంతో అక్కడ గుట్టపైనే ఉంటున్న గ్రామస్థులతో వీడియో కాల్‌లో మాట్లాడారు. తమకు అందించిన నిత్యావసర సరుకులు అయి పోయాయని వారు తెలపగా స్పందించిన కలెక్టర్ తక్షణం ఐదు కిలోల కందిపప్పు, వంటనూనె, ఐదు రకాల కూరగాయలు అందించాలని అధికారులను ఆదేశించారు.


తిరుమలాపురంలో వరద బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

పట్టిసీమ నుంచి 5,310 క్యూసెక్కులు విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం ప్రాజెక్టు కుడికాల్వకు శుక్రవారం 15 పంపుల ద్వారా 5,310 క్యూసెక్కుల జలాలు విడుదల చేసినట్టు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు తెలిపారు. పోలవరం స్పిల్‌వే నుంచి 11,06,947 క్యూసెక్కుల వరద జలాలు విడుదల చేసినట్టు ఈఈ మల్లిఖార్జునరావు, డీఈ మాధవరావు తెలిపారు.


కుక్కునూరులోని కొండేటివాగు తీరంలో ఇంకా తగ్గని వరద

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరు సిటీ : నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. గడచిన 24 గంటల్లో కుక్కునూరులో 4 మిల్లీ మీటర్లు, వేలేరుపాడు 2, జంగారెడ్డిగూడెం 1.8, కామవరపుకోట 0.4, కొయ్యలగూడెం, బుట్టాయిగూడెంలలో 0.2 మి.మీ వర్షపాతం నమోదైంది.


వరదకు కొట్టుకుపోయిన ఆలయానికి వెళ్లే మెట్ల దారి

గుబ్బల మంగమ్మ ఆలయం మూసివేత

భారీ వర్షాల కారణంగా బుట్టాయగూడెం మండలంలోని గుబ్బల మంగమ్మ ఆలయ పరిసరాలు దెబ్బ తినడంతో మరమ్మతుల నిమిత్తం ఆలయాన్ని మూసివేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. మరమ్మ తులు పనులు పూర్తి కావడానికి 15 రోజులకుపైగా పడుతుందన్నారు. పనులు పూర్తికాగానే అమ్మ వారి దర్శనానికి అను మతి స్తామని తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో అమ్మ వారి ఆలయం వద్ద వాగుల ఉధృతి తగ్గింది.

లెక్క తేల్చుద్దాం

తణుకు, తాడేపల్లిగూడెంలో టీడీఆర్ గుట్టు విప్పేందుకు ప్రభుత్వం సిద్ధం

సీబీసీఐడీ విచారణకు ఆదేశం

- బట్టబయలు కానున్న వైసీపీ నేతల బండారం
- ఇప్పటికే తణుకులో అధికారుల బలి.. బ్లాక్ లిస్ట్‌లో బాండ్‌లు
- తాడేపల్లిగూడెంలోనూ అధికారులపై వేటు తప్పదు

(భీమవరం-ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో మంజూరుచేసిన టీడీఆర్ బాండ్‌ల కుంభకోణం గుట్టు రట్టు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశాలు జారీచేసింది. నిజాలు నిగ్గు తేల్చేందుకు సీబీసీఐడీ రంగంలోకి దిగుతోంది. తణుకులో జరిగిన కుంభ కోణంపై ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ శాసనసభలో ప్రస్తావించారు. తాడేపల్లిగూడెం కుంభకోణంపై టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి మున్సిపల్ అధికారులకు వివరాలు అందజేశారు. దీంతో ప్రభుత్వం విశాఖపట్నం, తిరుపతి, తణుకులతో పాటు తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలోనూ ఈ కుంభకోణం నిగ్గు తేల్చాలని సీబీసీఐడీని ఆదేశించింది.

వైసీపీ ప్రభుత్వ హయాంలో తణుకు మునిసిపాలిటీలో కంపోస్ట్ యార్డు విస్తరణ కోసం ఆరు ఎకరాలను కొనుగోలు చేశారు. ఎకరానికి రూ.కోటి చెల్లించేలా స్థల యజమానులతో మునిసిపాలిటీకి ఒప్పందం కుదిరింది. ఇంత వరకు బాగానే వుంది. కాని తర్వాత మున్సిపాలిటీ దానిని గజాల్లో మార్చేసి, గజం ధర రూ.20 వేలుగా నిర్ణయించింది. రోడ్లు విస్త రించాలనుకున్నప్పుడే మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా స్థలాలను సేకరిస్తారు. ఇందుకోసం స్థల యజమానులకు గజానికి నాలుగు రెట్లు విలువైన బాండ్‌లు జారీచేస్తారు. కానీ తణుకులో కంపోస్ట్ యార్డు కోసం ముందుగానే స్కెచ్ వేసి భూమిని గజాల్లో సేకరించారు. సెంటుకు 48 గజాల వంతున ఎకరానికి 4,800 గజాలుగా నిర్ణయించారు. నాలుగు రెట్లు టీడీఆర్ బాండ్‌లు జారీచేశారు. ఒక్కో గజానికి రూ.20 వేల ధరతో బాండ్‌లు మంజూరయ్యాయి. అంటే ఎకరం విలువ రూ.38 కోట్లు అయ్యింది. కేవలం రూ.కోటి విలువ చేసే భూమిని రూ.38 కోట్ల విలువతో మున్సిపాలిటీ సేకరించింది. కంపోస్ట్ యార్డు కోసం గజాల రూపంలో సేకరించి టీడీఆర్ బాండ్‌లు జారీ చేయడం ఒక తప్పిదమైతే రిజిస్ట్రేషన్ చేయకుండానే ఒప్పందం చేసుకున్న వారి పేరుతో మంజూరు చేయడం మరో తప్పిదం. ఈ విషయంలో వైసీపీ నేత కీలకంగా వ్యవహరించారు.

కొత్త రహదారి ఏర్పాటు, గ్రీన్ ఫీల్డ్ అంటూ మరో తొమ్మిది ఎకరాల భూమికి బాండ్‌లు జారీ అయ్యాయి. మొత్తంగా 21 ఎకరాలకు రూ.900 కోట్ల విలువైన బాండ్‌లు జారీ అయ్యాయి. అప్పట్లో టీడీపీ గట్టి పోరాటం చేయడంతో ప్రభుత్వం తూతూమంత్రంగా దర్యాప్తు చేపట్టింది. తక్షణం మునిసిపల్ కమిషనర్, టీపీవోలను సస్పెండ్ చేశారు. బాండ్‌లను బ్లాక్ లిస్టులో పెట్టారు. బాండ్‌ల మంజూరులో కీలకపాత్ర పోషించిన వైసీపీ నేతలపై ఎలాంటి చర్యలు లేవు. బాండ్‌ల కొనుగోలు చేసిన వారంతా రోడ్డున పడ్డారు. ఇప్పుడు వీటిపై సీబీసీఐడీ దర్యాప్తు జరగనుంది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీఆర్ బాండ్‌లపై పట్టు బిగించింది. బాండ్‌ల జారీతోపాటు, అమ్మకం నిర్వహించిన వారు బలి కానున్నారు. వైసీపీ నేత ఖాతాలోనూ నేరుగా జమ అయితే ఆయనపైనా చర్యలు ఉండే అవకాశం ఉంది.

తాడేపల్లిగూడెంలో నేతకే ముడుపులు

తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో ముగ్గురు కమిషనర్‌లు రహదారి విస్తరణ పేరుతోనే టీడీఆర్ బాండ్‌లు జారీచేశారు. లబ్ధి మాత్రం వైసీపీ నేతకు దక్కింది. తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో కూటమి నేతల లెక్కల ప్రకారం రూ.142 కోట్ల విలువైన బాండ్‌లు జారీచేశారు. అధికారులు మాత్రం రూ.82 కోట్ల విలువైన బాండ్‌లు జారీచేసినట్టు లెక్కలు చెబుతున్నారు. తాడేపల్లిగూడెంలోనూ స్థల యజమానుల పేరుతో కాకుండా ఒప్పందం చేసుకున్న వారితో బాండ్‌లు జారీ అయిన ఉదంతాలు ఉన్నాయి. వైసీపీ నేత మున్సిపల్ అధికారుల మెడపై కత్తిపెట్టి ఉన్నతాధికారులతో ఒత్తిడి పెంచి బాండ్‌లు మంజూరు చేయించారు. ప్లాన్ లేకుండా వైసీపీ నేత కల్యాణ మండపం నిర్మించారు. అదే స్థలంలో రహదారి విస్తరణ అంటూ వైసీపీ నేత పేరుతో బాండ్‌లు మంజూరుచేశారు. తెలుగుదేశం నాయకులు పట్టుబడితే అక్కడ స్థలాన్ని సేకరించినట్టు హద్దులు గీశారు. మిగిలినచోట్ల ఎక్కడా స్థలాలను సేకరించకుండానే బాండ్‌లు జారీ అయ్యాయి. అటువంటి చోట్ల వ్యాపార సముదాయాలు వున్నాయి. రహదారి విస్తరిస్తేనే స్థల సేకరణ ఆవశ్యకత ఉంటుంది. రహదారి విస్తరణ జరగదని తెలిసే మాస్టర్ ప్లాన్ పేరుతో 100 అడుగులకు బాండ్‌లు జారీ చేస్తున్నారు. తాడేపల్లిగూడెం-భీమవరం రహదారి వెంబడి మున్సిపాలిటీ ఇటువంటి దందా సాగించింది. ఇప్పుడు సీబీసీఐడీ దర్యాప్తునకు ఆదేశించడంతో అధికారుల వెన్నులో వణుకు పుడుతోంది. బాండ్‌లు జారీచేసిన అధికారులు ఇతర చోట్లకు బదిలీపై వెళ్లిపోయారు. వారంతా కూటమి నేతలతో సంప్రదింపులు జరిపినా ఫలితం లేకపోయింది. త్వరలోనే ఈ రెండు మునిసిపాలిటీల్లో గట్టు రట్టుకానుంది.

అసెంబ్లీ వాయిస్..

తమ్మిలేరుకు శాశ్వత పరిష్కారం చూపించండి



భారీ వర్షాలు, వరదలు వచ్చినప్పుడు తమ్మిలేరు అధిక ప్రవాహానికి గురై చుట్టు పక్కల కాలనీల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దీనికి శాశ్వత పరిష్కారం చూపెట్టాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అసెంబ్లీలో కోరారు. ఎమ్మెల్యే అయిన తరువాత అసెంబ్లీలో శుక్రవారం చంటి నియోజకవర్గ సమస్యలపై మాట్లాడారు. "గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల కాలంలో ఒక్క రోడ్డు వెయ్యలేదు.. ఉన్న రోడ్లు కూడా గుంతలుపడి పాడైపోయాయి..ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్ల పై గోతులు, నీరు నిలిచిపోయి రోడ్లే చెరువుల్లా మారాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, వరదలతో గోదావరి జిల్లాల్లో రైతులు తీవ్ర నష్టపోయారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. పంటపొలాల్లో నుంచి వర్షపు నీరు బయటకు వెళ్ళేందుకు కాల్వలను రిపేర్ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు

– ఏలూరు టూటౌన్

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



మంత్రి పవన్ కల్యాణ్ తో మాట్లాడుతున్న ఆరిమిల్లి

నియోజకవర్గంలోని గ్రామాల్లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని ఉప ముఖ్య మంత్రి పంచాయతీరాజ్ మంత్రి పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అసెంబ్లీలో కోరారు. శుక్రవారం ఆయన లసెంబ్లీలో మాట్లాడుతూ ప్రధానంగా గ్రామాల్లో పంచాయతీరాజ్ రోడ్లు, జలజీవన్ మిషన్ నుంచి ఇంటింటికి కుళాయి ద్వారా తాగునీరు, పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. – తణుకు



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

మిలటరీ మాధవరంలో కార్గిల్ దివస్

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 26: కార్గిల్‌లో పాక్‌ను చిత్తుగా ఓడించిన సైన్యం పరాక్రమానికి ప్రతీకగా జరుపుకునే విజయ్ దివస్ వేడుకల్లో భాగంగా మిలటరీ మాధవరంలో శుక్రవారం అమరవీరుల స్థూపం వద్ద మాజీ సైనికులు అమర జవాన్లకు నివాళులర్పించారు. గ్రామం నుంచి కార్గిల్ వార్‌లో భాగస్వాములైన అప్పటి సైనికులు గూడా సుందరరావు, బొల్లం వీరయ్య , లక్కాకుల ప్రభాకరరావు, జుజ్జూరి వీరనాగ బ్రహ్మంలను మాజీ సైనికుల సంఘం సత్కరించింది. మాజీ సైనికుల సంఘ నాయకులు గోపిశెట్టి భరతుడు, లక్కాకుల నాగేశ్వరరావు, ప్రత్తి సూర్యనారాయణ, రామకృష్ణ, చినమిల్లి అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు పట్టించుకోకుంటే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ పంపిణీ సంస్థ లోక్ అదాలత్ చైర్మన్ సత్యనారాయణ

ఏలూరు రూరల్, జూలై 26: విద్యుత్ సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదు చేసినా సిబ్బంది పట్టించు కోకుండా కాలయాపన చేస్తుంటే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కా రానికి ఏర్పాటు చేసిన సీజీఆర్ఎఫ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించి సమస్యలు పరిష్క రించుకోవాలని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ లోక్ అదాలత్ చైర్‌పర్సన్, విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ వి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం అశోక్‌నగర్‌లోని విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ వినియోగ దారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది సేవలను సక్రమంగా నిర్వహించక పోయినా నిర్ణీత వ్యవధిలో పరిష్క రించని పక్షంలో బాధితులు తమను సంప్రదించవచ్చన్నారు. బిల్లులో తేడాలు, విద్యుత్ తీగల్లో సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు, వోల్టేజ్, అదనపు లోడ్ మంజూరు, యజమాని పేరు మార్పు, కేటగిరీ మార్పు వంటి సమస్యలను ఆన్‌లైన్ ద్వారా సీజీఆర్ఎఫ్‌కు ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలన్నారు. పలువురు తమ సమస్య లను విజ్ఞాపన పత్రం ద్వారా అందజేశారు. బి.జనార్ధన్‌రావు, ఆర్.సురేంద్ర కుమార్, ఏలూరు ప్రాంత విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలి

సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

భీమవరం అర్బన్, జూలై 26: షెడ్యూల్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతన చట్టం సవరించి అమలు చేయాలని సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్య దర్శి సీహెచ్ నర్సింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైస్ మిల్ కార్మికుల రాష్ట్ర విస్తృత సమావేశం యునియన్ జిల్లా కార్యదర్శి వాసుదేవరావు అధ్యక్షతన భీమ వరం ప్యాడీ అండ్ రైస్ మర్చంట్ హాలులో శుక్రవారం జరిగింది. రైస్ మిల్లుల్లో పని చేస్తున్న కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీస వేతనం, కార్మిక చట్టాలు అమలు జరగడం లేదన్నారు. కార్మిక చట్టాలు సరిగా అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కలెక్టర్ ఆఫీసుల వద్ద నిరసన ధర్నా చేయబోతున్నట్లు ప్రకటిం చారు. వివిధ జిల్లాలకు చెందిన కార్మిక సంఘ నాయకులు హనుమంతు కోటేశ్వ రరావు, గుబ్బల సత్యనారాయణ, తవిటి నాయుడు, సత్యనారాయణ పాల్గొన్నారు. నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైస్ మిల్లు కార్మికుల నూతన రాష్ట్ర కమిటీ కన్వీనర్‌లుగా వాసుదేవరావు, ఈశ్వరరావు, సుందర్‌బాబు, ధనరాజ్, బి.శ్రీను, రత్తయ్య, ఎర్రమల చంద్రయ్యలు ఎన్నికయ్యారు.

తప్పిన ముప్పు..



ద్వారకాతిరుమల, జూలై 26: ఇసుకు లోడుతో నల్లజర్ల మండలం పోతవరం నుంచి ద్వారకా తిరుమలకు వస్తున్న ఓ లారీ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. డ్రైవర్ మద్యం సేవించి వాహనాన్ని నడిపినట్టు స్థానికులు చెబుతున్నారు. ద్వారకాతిరుమల కొండపైనున్న యాదవ కల్యాణమండపం సమీపంలో శుక్రవారం ఉదయం ఈ ఘటన జరిగింది. పోతవరం నుంచి ఇసుక లోడుతో వస్తున్న లారీ కల్యాణ మండపం వద్దకు వచ్చేసరికి అదుపుతప్పింది. రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని వేగంగా ఢీకొట్టింది. స్తంభం విరిగి రోడ్డుపై పడగా లారీ బోల్తా పడింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై ప్రమాదం జరిగే సమయానికి ఎవరూ లేకపోవడంతో పెనుముప్పు తప్పింది.

ఆటో డ్రైవర్‌ను కాపాడిన స్థానికులు



తాడేపల్లిగూడెం రూరల్, జూలై 26: తాడేపల్లిగూడెంలో అంతా రద్దీగా ఉండే ఫ్లైఓవర్ వంతెన వద్ద ఓ యువకుడు సడన్‌గా ఆటో ఆపి వంతెన వెనుక భాగంలో ఉన్న గ్రిల్స్ వద్ద నిల్చుని ఉన్నట్టుండి కాలువలో పడిపోయాడు. ఈ ఘటన చూసిన స్థానికులు ఒక్కసారిగా కాల్వలో దూకి అతన్ని బయటకు తీసుకొచ్చి సపర్యలు చేసి బతికించారు.స్పృహలోకి వచ్చిన తర్వాత ప్రాథమిక చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదవశాత్తూ జరిగిందా? ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడా అనేది తెలియలేదు.

జూదాలకు రెడీ



తెరుచుకుంటున్న పేకాట క్లబ్‌లు

- జూద కేంద్రాలు పున ప్రారంభం
- గత కొన్నేళ్లుగా మూత
- ప్రభుత్వం మారడంతో ఊపు
- రమ్మీ ముసుగులో లక్షల్లో జూదం
- పోలీసుల ప్రేక్షక పాత్రపై అనుమానం

పాలకొల్లు, జూలై, 26: కొన్నేళ్లుగా జూదరులు చేతికి పనిలేక తిమ్మిరెక్కాయి. ఇప్పుడు పట్టణాల వారీగా జూద కేంద్రాలు పునప్రారంభం కావడంతో జూదరుల్లో ఉత్సాహం పెరిగింది. గత జగన్‌రెడ్డి పరిపాలనలో అరాచకాలతో జూద కేంద్రాలపై ఓ కన్నేశారు. జూదాలకు వెళ్లే సొమ్ములు సైతం నొక్కేసే క్రమంలో గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు పేకాట క్లబ్బులపై కన్నెర్ర జేసింది. సంక్రాంతి వంటి పండుగ దినాలు, ప్రత్యేక సందర్భాలల్లో ఆ పార్టీ నాయకులే కేసినో వంటివి నిర్వహించుకునేందుకు సహకరించింది.

రమ్మీ ముసుగులో ..

ఇప్పుడు పూర్వపు పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాలోనూ పలు క్లబ్బులు పునప్రారంభమయ్యాయి. సొమ్ములు లేకుండా రమ్మీ వంటి పేకాటకు అనుమతులు ఉన్నాయి. అయితే రమ్మీ ముసుగులో ఇప్పుడు పెద్దఎత్తున పేకాటలు నిర్వహించడానికి పలు క్లబ్బులు సమాయత్తం అవుతున్నాయి. ఇప్పటికే భీమవరం, రాజమండ్రి, గుంటూరు, పాలకొల్లు తదితర ప్రాంతాల్లో పలు పేకాట క్లబ్బులు ప్రారంభం కాగా ఏలూరు తణుకు తాడేపల్లిగూడెం పలు పట్టణాల్లో జూదం నిర్వాహణకు సమా యత్తం అవుతున్నట్లు సమాచారం. రాష్ట్రంలో కొన్ని సంప్రదాయ క్లబ్బులకు అనుమతులు ఉన్నాయి. అయా కమ్యూనిటీ క్లబ్బులలో క్యారెమ్స్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, రమ్మీ (పేకాటలో 13 ముక్కల ఆట) తదితర క్రీడలకు అనుమతులు ఉన్నాయి. అయితే ఈ ముసుగులో పెద్ద ఎత్తున సొమ్ములు పందేలు కాస్తూ రమ్మీ, మూడు ముక్కలాట, కోతాట, జూద కార్యక్రమాలు నిర్వహించడానికి సమాయత్తం అవుతున్నారు.



పేకాట, పెంకునేత , పేర్పిడి, లోనా బయట, ఇలా పలు పేర్లతో పేకాట ఆడుతుంటారు. వాస్తవానికి క్లబ్బులలో పరిమిషన్ తీసుకుని రమ్మీ ఆట మాత్రమే సొమ్ములు లేకుండా ఆడుకునే అవకాశం ఉంది. అయితే ఇప్పుడు పలు క్లబ్బులలో రోజుకి 5 నుంచి 20 లక్షల రూపాయలు వరకూ జూదం జరుగుతుందని సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా జూదానికి తెరతీయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో ఆదర్శ పాలన అందిస్తామని కూటమి ప్రభుత్వం చెబుతుండగా మరో వైపు విచ్చలవిడి జూదానికి పలువురు ప్రయత్నాలు చేస్తూ ఇప్పటికే కొన్నిచోట్ల ప్రారంభించడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అందులో ప్రజాప్రతినిధులు పాత్ర ఎంత మేరకు ఉందో తెలియాల్సి ఉంది. పలు జిల్లాల్లో జూద కార్యక్రమాలు మొదలై నప్పటికీ పోలీస్ అధికారులు ప్రేక్షకపాత్ర వహించడంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. నవ్యాంధ్ర ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో కొన్ని క్లబ్బులలో పేకాటలు జరిగేవి. సంక్రాంతి, ఇతర ఉత్సవాలు సమయంలో ప్రభుత్వం చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ ఉండటంతో జూదాలు జరిగేవి.

మాయ లేడీ

- నరసాపురంలో తాకట్టు మోసం
- కేజీ పైనే నకిలీ బంగారం
- రూ.67 లక్షలకు పైగా టోకరా
- ఉల్కికిపడ్డ బులియన్ వర్తకులు
- ఎస్పీని ఆశ్రయించిన వ్యాపారులు



నరసాపురం పట్టణంలోని పార్శ్వనాథ్ బ్యాంకర్స్

నరసాపురం, జూలై 26: వ్యాపారానికి, అప్పుకు నమ్మకమే మూలం. ఇవే మన సిబిల్ స్కోర్‌ను పెంచుతాయి. ఈ నమ్మకాన్నే కొందరు కేటుగాళ్లు క్యాష్ చేసుకుని పట్టణానికి చెందిన ఓ తాకట్టు వ్యాపారిని బురిడి కొట్టించి లక్షలు కాజేశారు. దాదాపు ఏడాదిగా సాగుతున్న ఈ మోసాన్ని చివరికి వ్యాపారి సమీప బంధువు గుర్తించడంతో అసలు బండారం బయట పడింది. అప్పటికే జరగాల్సిన నష్టం భారీగా జరిగింది. దాదాపు కేజీపైనే నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.67 లక్షలపైనే కాజేశారు. మోసగాళ్లను పట్టుకుని నిలదీస్తే అడ్డం తిరిగి నానా రాద్ధాంతం చేసి పరారయ్యారు. నరసాపురంలో వెలుగుచూసిన ఈ మోసం బులియన్ వ్యాపారుల్ని ఒక్కసారిగా ఉలికిపాటుకు గురి చేసింది. మరోవైపు పోలీసులు ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్నారు. ఈ మోసగాళ్లు జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లో ఇంకెంత మంది వ్యాపారుల్ని దగా చేసారన్న దానిపై దృష్టి సారించారు. దీనికి సంబంధించి నరసాపురం బులియన్ సంఘం అధ్యక్షుడు వినోద్ కుమార్ జైన్ తెలిపిన వివరాలు ఇవీ..

20 సార్లు పైనే తాకట్టు

నరసాపురం మెయిన్‌రోడ్‌లో సుమేరామల్ జైన్ పార్శ్వనాథ్ బ్యాంకర్స్ పేరుతో తాకట్టు వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఈయన దగ్గర నరసాపురం పట్టణానికి చెందిన శిరిగినీడి ఉషారాణి కుటుంబం చాలా ఏళ్ల నుంచి బంగారం తాకట్టు పెట్టి అప్పు తీసుకుంటూ వస్తున్నది. ఇలా వ్యాపారికి ఆ కుటుంబంపై నమ్మకం పెరిగింది. దీన్నే ఉషారాణి మోసానికి ఎంచుకుంది. తాకట్టు పెడుతున్న బంగారాన్ని వ్యాపారి గీటు వేయ కుండానే అప్పు ఇస్తుండటం గమనించి ప్లాన్ రెడీ చేసింది. ముందుగా కొన్ని నకిలీ బంగారంతో తయారైన వస్తువుల్ని తీసుకుచ్చి తాకట్టు పెట్టింది. వ్యాపారి గీటు వేయకుండా అడిగినంత డబ్బు ఇచ్చాడు. తరువాత మరికొన్ని నెలలకు ఇంకొన్ని వస్తువులు తీసుకుచ్చి మళ్లీ అప్పు తీసుకుంది. అప్పుడు కూడా వ్యాపారి గీటు వేయలేదు. ఇలా దాదాపు 20 సార్లుపైనే పలు వస్తువుల్ని తాకట్టు పెట్టింది. ఒక్కసారి కూడా వ్యాపారి గీటు వేయకపోవడంతో నకిలీ బంగారం పెట్టి లక్షలు దోచేసింది. అయితే ప్రతిసారి అప్పు తీసుకు న్నప్పుడల్లా తాకట్టులో ఉన్న వస్తువులకు వడ్డీ కట్టేస్తూ నమ్మకాన్ని మరింత పెంచుకుంది.

బయటపడిందిలా..

అయితే మోసం ఎంతోకాలం నిలవదంటారు. ఈ మాయలాడి విషయంలో అది రుజువైంది. వారం రోజుల క్రితం కొన్ని వస్తువుల్ని తాకట్టు పెట్టి అప్పు తీసుకుంది. ఆ సమయంలో వ్యాపారి జైన్ గీటు పెట్టకుండా అప్పు ఇవ్వడాన్ని ఆ సమయంలో అక్కడ ఉన్న ఆయన సోదరుడు గుర్తించాడు. వెంటనే మాయలేడి ఉషారాణి బయటకు వెళ్లగానే ఆ వస్తువుల్ని గీటు పెట్టమని సోదరుడిని కోరారు. చాలా నమ్మకస్తురాలని, చాలాకాలం నుంచి అప్పు తీసుకుంటున్నదని వ్యాపారి చెప్పినప్పటికీ ఆయన సోదరుడు వినలేదు. గీటు గీయడంతో అసలు బండారం బయటపడింది. అక్కడితో విడిచి పెట్టలేదు. మరోషాపుకి పంపి గీటు తీయించాడు. అక్కడ కూడా నకిలీ అని తేలింది.

అల్లరి చేయకండి..కట్టేస్తా..

అయితే భాగోతం బయటపడటంతో మాయలాడి కాళ్ల బేరానికి వచ్చింది. నెల్లూరుకు చెందిన వ్యాపారి దగ్గర ఈ బంగారాన్ని కొని మోసపోయానని నమ్మబలికింది. తనకు సమయం ఇస్తే విడిపించుకుని వెళ్లిపోతానని భరోసా ఇచ్చింది. అయితే మూడు రోజులైనా తిరిగి రాకపోవడంతో వ్యాపారి ఫోన్ చేశాడు. ఆసమయంలో తనతో నెల్లూరు నుంచి ముగ్గురిని తీసుకు వచ్చింది. అందులో ఒకరు నానా రాద్ధాంతం చేసి వ్యాపారుల్ని బెదిరించాడు. మోసపోయిన తాకట్టు వ్యాపారి జైన్ సంఘంలో పెట్టాడు. వెంటనే జోక్యం చేసుకున్న సంఘం పెద్దలు శుక్రవారం జిల్లా ఎస్పీని కలిశారు. కేసు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ నయీం నరసాపురం సీఐ స్వామిని ఆదేశించారు. మరోవైపు ఈ తరహా మోసం ఒక్క నరసాపురంలోనే జరిగిందా ? లేక ఇతర ప్రాంతాల్లో కూడా జరిగిందన్న దానిపై కూడా పోలీసులు ఆరా తీసే పనిలో పడ్డారు. విచారణలో మోసానికి పాల్పడిన ఉషారాణి కొంత కాలం నుంచి నెల్లూరులో ఉంటున్నట్లు తెలిసింది. ఆమెకు మద్దతుగా వచ్చిన యువకులు నెల్లూరుకు చెందినవారుగా అనుమానిస్తున్నారు. ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

తక్కువ రవాణా చార్జీలతో ఉచిత ఇసుక

కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, జూలై 26 : జిల్లా వాసులకు ఉచిత ఇసుకను తక్కువ రవాణా చార్జీలతో అందించడానికి కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదల వాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం వెలగపూడి సచివాలయం నుంచి గనులు, భూగర్భ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని, రవాణా చార్జీలు మాత్రమే వసూలు చేయాలని చెప్పారు. ఇసుక నిల్వ పాయింట్ల వద్ద రవాణా చార్జీలను డిస్‌ప్లే చేయా లన్నారు. రవాణా చార్జీలను జిల్లాస్థాయి కమిటీ నిర్ణయించాలని చెప్పారు. స్టాక్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక అందుబాటులో లేదని, తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం నుంచి ఇసుక కొనుగోలుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.అన్ని చార్జీలతో కలిపి రావులపాలెం స్టాక్ పాయింట్ వద్ద మెట్రిక్ టన్నురూ. 265, ఉనులుమర్రు, పెండ్యాల, పందల పర్రు వద్ద రూ.270 ధరకు అందుబాటులో ఉందన్నారు. రవాణా చార్జీలు జిల్లాలోనీ ప్రాంతాలను బట్టి ఉంటుందని వివరించారు. డీసిల్టింగ్ పాయింట్లు వినియోగంలోకి తీసుకురావడానికి పర్యావరణ అనుమతుల కోసం ప్రతిపాదలను పంపామన్నారు. గనులు, భూగర్భ శాఖ కమిషనర్ ప్రవీణ్ కుమార్ జిల్లాల వారీగా ఇసుక నిల్వ, వార్షిక డిమాండ్, కార్యాచరణ ప్రణాళిక, రీచ్‌ల గుర్తింపు, రవాణా చార్జీలు, డీసిల్టేషన్, తదితర వాటిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. డీఆర్వో ఉదయ భాస్క రరావు, కెఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా గనులు, భూగర్భ శాఖాధికారి ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రశాంతంగా హార్టీ సెట్

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 26: డాక్టర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బీఎస్సీ హార్టీకల్చర్‌లో ప్రవేశానికి శుక్రవారం నిర్వహించిన హార్టీసెట్-24 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. రాష్ట్రంలోని వెంకట్రామన్నగూడెం, అనం తరాజు పేట, పార్వతీపురం చినలాటరపిల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. గూడెంలో 266 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఈ పరీక్షలను రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, డీన్ పద్మావతమ్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డీవి స్వామిలు పర్యవేక్షించారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్ ఢీకొని లారీ డ్రైవర్ మృతి

పెదవేగి, జూలై 26 : రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొట్టిన సంఘటనలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్టు పెదవేగి ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. రాయన్నపాలెం శివారు చింతల పాటివారి గూడెంలో నివాసముంటున్న ఆకుమర్తి చిన్నారావు లారీడ్రైవరు. గురువారం సాయంత్రం రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో గాయపడిన చిన్నారావు (40) అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కిందపడి వృద్ధుడి మృతి

ఆకివీడు, జూలై 26 : రైలు కిందపడి ఒక వృద్ధుడు మృతి చెందాడు. ఆకివీడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ సమీపంలో కోట్ల కన్నంనాయుడు (50) నివశిస్తున్నాడు. కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురు వారం రాత్రి ఇంటి నుంచి బహిర్భూమికని వెళ్లిన నాయుడు రైలు కింద పడి చనిపోయాడురైల్వే ఎస్‌ఐ రమణ కేసు నమోదు చేశారు.

అప్పులు తీర్చలేను..చావే గతి

ఆత్మహత్యాయత్నం..చికిత్స పొందుతూ మృతి

ఏలూరు క్రైం, జూలై 26 : అప్పులబాధ భరించలేక పురుగు మందుతాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ఆంధ్రా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు సమీపంలోని శనివారపుపేటలో నివాసం ఉంటున్న గొల్లపల్లి రమేష్ (35)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ ఉంటాడు. నాలుగు నెలల క్రితం వరకూ వంగాయగూడెంలో నివాసం ఉండేవాడు. ఆ సమయంలో ఆ ప్రాంతంలోని ఒకరి వద్ద లక్షల్లో వడ్డీకి అప్పు తీసుకున్నాడు. అప్పుకు సంబంధించిన వడ్డీ కూడా చెల్లించకపోవడంతో నిలదీశారు. ఈనెల 23న పెద్ద మనుషుల ద్వారా సమస్య పరిష్కారం కోసం కూర్చున్నారు. తాను వడ్డీలు కూడా చెల్లించలేనని తనకు చావే మిగిలి ఉందంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. పురుగుమందు తాగేసి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ఆంధ్రా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్తపై చీటింగ్ కేసు

ఏలూరు క్రైం, జూలై 26 : భార్యకు తెలియకుండానే ఆమె పేరుమీద బ్యాంకులో క్రెడిట్ కార్డు తీసుకుని రెండున్నర లక్షల రూపాయలు వాడుకుని కట్టకుండా మోసగించడంతో బాధితురాలు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. విశాఖపట్టణంలోని కింగ్‌జార్జి ఆసుపత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కెసువర్ణకు ఏలూరుకు చెందిన మున్నాల సందీప్‌తో 2018 ఫిబ్రవరి 27న వివాహం అయింది.కొంతకాలం తరువాత వీరి మధ్య మనస్పర్థలు రావడంతో వేర్వే రుగా ఉంటున్నారు. 2023 డిసెంబర్‌లో లోన్ పెట్టుకోవ డానికి సువర్ణ తన సిబిల్ స్కోరును తనిఖీ చేయించగా ఏలూరులోని ఒక బ్యాంక్ క్రెడిట్ కార్డు ద్వారా రెండున్నర లక్షల రూపాయలు బకాయి పడినట్లుగా చూపించింది. దీంతో ఆమె విచారణ చేయగా ఆమె బ్యాంక్ అకౌంట్‌పై క్రెడిట్ కార్డును ఆమె భర్త తీసుకుని అతని ఫోన్ నెంబర్ ద్వారా లావాదేవీలు జరిపినట్టు తెలిసింది. దీంతో బాధితురాలు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సందీప్‌పై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చైన్ స్నాచింగ్‌పై ఫిర్యాదు

భీమవరం క్రైం, జూలై 26 : గుర్తు తెలియని వ్యక్తులు మెడలో చైన్ లాక్కు వెళ్లారని మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వరరావు శుక్రవారం చెప్పారు. హైద్రా బాద్ మేడిచర్లకు చెందిన ముదునూరి విజయలక్ష్మీ ఈ ఏడాది మే నెలలో భీమవరం పట్టణం నరసయ్య అగ్రహారంలోని పుట్టింటికి వచ్చింది. ఆమె మే 4వ తేదీన హైద్రాబాద్ తిరిగి వెళ్లేందుకు నడిచి వెళుతుండగా మోటార్ సైకి ల్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలోని కాసున్నర బంగారు చైన్ లాక్కుపోయారు. బాధితురాలు శుక్రవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

19.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

జంగారెడ్డిగూడెం, జూలై 26 : లక్కవరంలో అక్రమంగా బొలేరో వాహ నంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పౌరసరఫరా శాఖ, పోలీసు అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి నుంచి రాజానగరానికి రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సివిల్ సప్లై డీటీ లక్ష్మీ కుమారి తెలిపారు. 19.40 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని వీటి విలువ రూ.34,920 ఉంటుందని తెలిపారు. దేవులపల్లికి చెందిన కె.బాలాజీ, వై.రాము, డి.రామకృష్ణ, రాజానగరానికి చెందిన సత్తిబాబులు ఈ బియ్యాన్ని తరలిస్తున్నారని వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. లక్కవరం ఎస్సై సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

పొలంగట్టు తగాదా..హత్య



మృతిచెందిన ఏసు

పెదవేగి, జూలై 26: ముంపునకు గురైన వరిపొలంలో నీటిని బయ టకు పంపించే దగ్గర ఏర్పడిన వివాదం చిలికి చిలికి హత్యకు దారితీసింది. పెదవేగి ఎస్‌ఐ వి.రాజేంద్ర ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం కూచింపూడికి చెందిన కలపాల ఏసు, అతని సమీప బంధువులైన రమేష్, మరికొందరికి గ్రామానికి ఆనుకుని వరి పొలాలు ఉన్నాయి. అన్న దమ్ముల పొలాలు కావడంతో వర్షం వచ్చిన సమయంలో ఒకరి పొలం నుంచి మరొకరి పొలంలోకి మురుగునీరు పారుతుంది. ఏసు పొలం పల్లపు ప్రాంతంలో ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాలతో పొలాలు నీటి ముంపునకు గురయ్యాయి. ముంపునీటిని దిగు వునకు పంపించే విష యంలో ఏసుతో అతనికి సమీప బంధు వులైన రమేష్,అతని సోదరుడు అచ్చియ్యలు శుక్రవారం రాత్రి ఇంటి దగ్గర ఘర్షణ పడ్డారు. పొలంలో అడ్డుగా వేసిన కట్టను తీసి వేస్తానని రమేష్, అతని సోదరుడు అచ్చియ్యలు గ్రామానికి సమీపంలోనే ఉన్న పొలానికి వెళ్లారు. దీనిపై ఆగ్రహంతో ఉన్న ఏసు, అతని సోదరుడు అచ్చిరాజు కూడా వారి వెంటే వెళ్లారు. అడ్డు వేసిన కట్టను తొలగిస్తున్న అచ్చియ్యపై ఏసు కత్తితో దాడి చేశాడు. తన తమ్ముడిని చంపే స్తున్నాడే ఆందోళనతో ఏసుపై రమేష్ కత్తితో దాడిచేశాడు. ఈ దాడిలో ఏసు (40) మెడపై తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందు కున్న నూజివీడు డీఎస్పీ జి.లక్ష్మయ్య ఆదేశాలతో పెదవేగి సీఐ కె.శ్రీనివాస్‌కుమార్, ఎస్‌ఐ రాజేంద్ర ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకు న్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ఏలూరు ప్రభు త్వాసుపత్రి మార్చురీకి తరలించారు.



రికవరీ చేసిన సెల్‌ఫోన్లు

బాధితుడికి ఫోన్ అందిస్తున్న ఏలూరు ఎస్పీ కిశోర్

రూ.21 లక్షల విలువైన ఫోన్లు రికవరీ

ఏలూరు క్రైం, జూలై 26 : జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఫిబవరి నుంచి ఏప్రిల్ నెల వరకు జరిగిన సెల్ ఫోన్ చోరీలకు సంబంధించిన 151 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్టు ఏలూరు జిల్లా ఎస్పీ కిషోర్ చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులకు వివరాలను ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ స్వరూపరాణి వెల్లడించారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారికోసం ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నెంబర్ 95503 51100కు ఫిర్యాదులు చేయడంతో ఏలూరు సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు సీసీఎస్ సిబ్బంది, దర్యాప్తు చేపట్టి 151 ఫోన్లను రికవరీ చేశారు. వీటి విలువ 21 లక్షల 14 వేల రూపాయలని తెలిపారు. ఏలూరు, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్ జిల్లా, అంబేడ్కర్ కోనసీమ, కృష్ణా, విశాఖపట్టణం, తూర్పుగోదావరి, విజయనగరం, విశాఖ, తెలంగాణా తదితర ప్రదేశాల నుంచి మొబైల్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, బ్యాంకులు, ఏటీఎంలు, రైతు బజార్లు, రద్దీ ప్రదేశాల్లో ప్రజలను దృష్టి మళ్ళించి మొబైల్స్ దొంగిలిస్తున్నారన్నారు. ప్రజలు తమ సెల్‌ఫోన్‌లో సమాచారాన్ని ఎప్పటికప్పుడు బ్యాకప్ చేసుకోవాలని సూచిం చారు. యాప్‌లక పాస్‌వర్డ్ రక్షణ కల్పించుకుని ఫైండ్‌మై డివైజ్ ఆప్షన్ పెట్టుకోవాలన్నారు. సెల్‌ఫోన్లు రికవరీ చేసిన ఏలూరు సీసీఎస్ సీఐ మురళీకృష్ణ, సైబర్‌క్రైం ఎస్‌ఐ రాజాలను అభినందించారు. ఫోన్లు పోగొట్టు కున్న బాధితులకు సెల్‌ఫోన్లను అప్పగించారు.

ఆశ పడవద్దు..భయపడవద్దు : ఎస్పీ

ఆశ, భయం వల్ల ప్రజలు సైబర్ నేరాల బారినపడుతున్నారని ఎస్పీ కిషోర్ అన్నారు. ఈ రోజు ప్రతి ఒక్కరికి మొబైల్ ఫోన్ నిత్యావసరంగా మారిందని అన్నారు. నేరగాళ్ళు వివిధ రకాల యాప్‌లను తయారు చేసి ఆండ్రాయిడ్ ఫోన్లకు పంపించి ఆశ కల్పిస్తున్నారన్నారు. ఇంటి వద్దే ఉండి పార్ట్‌టైమ్‌గా జాబ్ చేసుకోవచ్చుని, రోజుకు వేలాది రూపాయలు సంపా దించవచ్చునని లేదా లాటరీలో సొమ్ము వచ్చిందనో, గిఫ్టులు వచ్చాయనో, ప్రైజ్ మనీ వచ్చిందనో ఆశ చూపించి తాము పంపిన లింకులను క్లిక్ చేసి బ్యాంకు వివరాలు, ఆధార్‌కార్డు వంటివి పంపించాలని కోరుతున్నారు. కొంతమంది ఆశతో ఆ లింకులను ఓపెన్ చేస్తున్నారని దీంతో ఆ ఫోన్ డేటా అంతా నేరస్తుల గుప్పెట్లోకి వెళ్ళిపోతుందని దీంతో వారి అకౌంట్ లోని సొమ్ములను తస్కరిస్తున్నారన్నారు. కొంతమంది సైబర్ నేరగాళ్ళు వీడియో కాల్స్‌చేసి తాము కస్టమ్స్ అధికారులమనో, ఇతర పోలీసు అధికారులమనో, ఏసీబీ అధికారులమని బెదిరిస్తున్నారని ఇలాంటి వాటికి భయపడిన కొంతమంది వారు చెప్పినట్లు సొమ్ములు చెల్లించుకుని ఆ తరువాత లబోదిబోమంటూ పోలీసులు ఆశ్రయిస్తున్నారన్నారు. ఇలాంటి కాల్స్ వస్తే సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయా లన్నారు. ఎవరైనా మొబైల్ ఫోన్లను పోగొట్టుకుంటే టోల్ ఫ్రీ నెంబర్ 95503 51100కు ఫిర్యాదు చేయాలని సూచించారు.


కూరగాయలతో కనకదుర్గమ్మకు ప్రత్యేక అలంకరణ

కనకదుర్గమ్మకు ఆషాఢ సారె, చీరెలు

పెదపాడు, జూలై 26: వట్లూరు నెహ్రూకాలనీలోని కనకదుర్గమ్మకు మహిళలు శుక్రవారం ఆషాఢ సారె, చీరెలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కూరగాయలు, పండ్లతో విశేషాలంకరణ చేశారు. మహిళలు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి సారె, చీరలను సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



శాకంబరిగా అంబికాదేవి

ఏలూరు కార్పొరేషన్, జూలై 26: సత్రంపాడులో అంబికాదేవి శుక్రవారం కూరగాయలతో శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అమ్మవారికి అర్చకులు పంచామృతాభిషేకం జరిపి అనంతరం శాకాంబరి అలంకరణ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అంబికా కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

● దెందులూరు: మండలంలోని ఉండ్రాజవరంలో కనకదుర్గమ్మ, అమ్మవార్లకు మహిళలు సారె, బోనాలను సమర్పించారు. 116 మంది ముత్తైదువులు సారె అందజేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు

● కామవరపుకోట: శ్రీలక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠానికి భక్తులు ఆషాడ సారెను సమర్పించారు. పండ్లు, ఫలాలు, పుష్పాలు, తీపి పదార్థాలతో ఊరేగింపుగా లలితాశ్రీ పీఠానికి తీసుకువెళ్లారు. సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు అమ్మవారికి అభిషేకాలు అనంతరం విశేష అలంకరణ చేశారు.

శ్రావణ మాసోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం, జూలై 26: నూకాలమ్మ ఆలయంలో ఆగస్టు 5 నుంచి సెప్టెంబరు 2 వరకూ శ్రావణ మాసోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజాన పండు తెలిపారు. ఉత్సవాల కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వాసవి, వనితా క్లబ్ సేవా కార్యక్రమాలు


విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

లింగపాలెం, జూలై 26: వాసవి, వనితా డైమండ్ క్లబ్‌లు పేదలకు తోడుగా ఉంటాయని అధ్యక్షుడు సోమిశెట్టి గంగాధరరావు అన్నారు. ధర్మాజీగూడెంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వీధి వ్యాపారులకు గొడుగులు, గ్రామాల్లో ఉన్న పేదకు బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. పోలీస్ సిబ్బందికి మాస్కులు, కండువాలు అందజేశారు. సీహెచ్ కిషోర్, రామకృష్ణ, మణిశ్రీ, పద్మిని, కందుల రత్నమాల, సమయమంతుల బలరామకృష్ణ, మన్యం పుల్లేశ్వరరావు, దమయమంతుల రమాదేవి, వాసవి, వనితా క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ఏలూరు రూరల్, జూలై 26: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని వృత్తిలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన విశ్వబ్రాహ్మణులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని విశ్వబ్రాహ్మణ ఉద్యోగ, వ్యాపారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎ.శివకేశ్వరరావు అన్నారు. సంఘ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికలను శుక్రవారం ఆవిష్కరించారు. వచ్చే నెల 11న రెవెన్యూ భవన్‌లో వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి లంకపల్లి జగదీష్ తెలిపారు. మెరిట్ విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందిస్తామన్నారు. ఎస్.బ్రుంగాచార్యులు, మానేపల్లి నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్, రామకృష్ణ, సుధాకర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిగణపవరానికి బస్సు సర్వీసు పునరుద్ధరించాలి

బుట్టాయగూడెం, జులై 26: ఏజెన్సీలో భారీ వర్షాలకు కల్వర్టులు దెబ్బతినడంతో నిలిపివేసిన జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కోరుతూ మాజీ ఎంపీటీసీ అందుగుల ఫ్రాన్సిస్ ఆర్టీసీ డిపో ఏఎం వరలక్ష్మికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రెడ్డిగణపవరం రహదారిలో జల్లేరు వాగుపై కల్వర్టు సగం వరకు కొట్టుకుపోవడంతో బస్సు నిపిలివేశారన్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామస్తులు కల్వర్టు ప్రాంతాన్ని సరిచేశారని, బస్సు సర్వీసు నడపాలని కోరారు.

దమ్ము చక్రాలతో గ్రామీణ రోడ్లు ధ్వంసం

చింతలపూడి, జూలై 26: దమ్ము చక్రాలతో ట్రాక్టర్ల రాకపోకలతో గ్రామీణ రోడ్లు ధ్వంసమవుతున్నాయని టీడీపీ రైతు విభాగం నేత గుత్తా వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. వర్షాలకు రోడ్లు గుంతలు పడి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ట్రాక్టర్ యజమానులు దమ్ముచక్రాలతో రోడ్లపై తిరగడం వల్ల మరింత ఛిద్రమవుతున్నాయన్నారు. శివపురం, యండపల్లి గ్రామాల్లో ప్రజలు మొత్తుకుంటున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు వీటిపై చర్యలు తీసుకోవాని ఆయన కోరారు.

కాంట్రాక్ట్ లెక్చరర్‌పై ఆర్‌జేడీ విచారణ

కామవరపుకోట, జూలై 26 : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్‌పై వచ్చిన అవినీతి అభియోగాలు, విమర్శలపై శుక్రవారం రాజమహేంద్రవరం ఆర్‌జెడి శోభారాణి విచారణ నిర్వహించారు. ఫిర్యాదుదారులు, విశ్రాంత అధ్యాపకుల వాంగ్మూలం నమోదు చేశారు. నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పిస్తానని ఆర్జేడీ తెలియజేశారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** భీమడోలు 132కె.వి పెదవేగి ఫీడర్ ప్రస్తుతం ఉన్న కండెక్టర్ మార్పు కారణంగా ఆగస్టు 1 వరకు వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ప్రతిరోజూ రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేయబడునని ఈఈ నటరాజన్ తెలిపారు.
- ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో దూర విద్యాకోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రకటన జారీ చేసిందని సి.ఆర్‌రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు తెలిపారు.
- **కామవరపుకోట :** తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో వాసవీ క్లబ్, వనితా క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్మించిన జాతిపిత మహాత్మాగాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలను శుక్రవారం ఆవిష్కరించారు. చిన్ని రామ సత్యనారాయణ, వందలపు జగన్నాధరావు, తహసీల్దార్ జి.వి.ఆర్.రమేష్, వాసవీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.
- **లింగపాలెం :** సీజనల్ వ్యాధులు, జ్వరం, టైఫాయిడ్, మలేరియా వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ కృష్ణకిషోర్ సూచించారు. కె.గోకవరంలో వైద్యశిబిరం నిర్వహించారు.
- **పోలవరం :** గ్రామంలో రూ.10 లక్షలతో డ్రైనేజీల నిర్మాణం పనులు ప్రారంభించారు. సర్పంచ్ పొడుం పుష్ప, పంచాయతీ కార్యదర్శి వై కొండలరావు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు.
- పోలవరం పెద రామాలయం వద్ద చోడిశెట్టి రాంబాబు దుకాణంలో వర్తక సంఘం నిర్వహణలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో చౌక ధరల దుకాణం ప్రారంభించారు.
- **టి.నరసాపురం :** సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఆగుతుందని, వినియోగదారులు సహకరించాలని జంగారెడ్డిగూడెం డీఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు.
- **జంగారెడ్డిగూడెం :** కుకునూరు, వేలేరుపాడు మండలాల వరద బాధితులకు సీపీఎం ఆధ్వర్యంలో సేకరించిన లక్ష రూపాయలు విలువ చేసే నిత్యావసరాల సరుకులు, దుస్తులు మందులు పంపిణీ చేసినట్లు మానుకొండ జీవరత్నం తెలిపారు.
- శ్రీనివాసపురం రోడ్‌లోని పెట్రోల్ బంకు సమీపంలో పేకాడుతున్న ఐదుగురిని పోలీసులు పట్టుకున్నారు. రూ.2140 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబసు తెలిపారు.
- **ద్వారకాతిరుమల :** రామన్న గూడెంకు చెందిన కిడ్నీ బాధితుడు పెచ్చెటి వీరాంజనేయులుకు యువకులు, గ్రామస్థులు రూ.52 వేలు, మానవత రూ.5 వేలు అందజేశారు. మద్రాస్ రాము, సయ్యద్ నాగిన్, నాగరాజు, కొండలరావు, కూనపాము రామారావు పాల్గొన్నారు.

రైతుబజార్ నిరుపయోగం


పీహెచ్‌సీ సమీపంలో నిర్మించిన రైతు బజార్ భవనం

రైతులు, వినియోగదారుల ప్రయోజనార్థం ఏర్పాటుచేసిన రైతు బజార్ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. జీలుగుమిల్లిలో సుమారు రూ.15 లక్షలతో పీహెచ్‌సీ సమీపంలో రైతు బజారు నిర్మించారు. 2019 తర్వాత ఇవి ఉపయోగం లేకుండా పోయాయి. చిన్న సన్నకారు రైతులు పండించిన కూరగాయలు నేరుగా వినియోగదారులకు విక్రయించే సౌలభ్యంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. నాణ్యమైన కూరగాయలు అందుబాటు ధరల్లో దొరికే వీలుంది. వీటి నిర్వహణ మూలన పడడంతో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు

- జీలుగుమిల్లి

కాల్వ గండిని పూడ్చిన తల్లిదండ్రులు


బూరుగువాడలో కాలువ గండి పూడ్చివేత పనులు

భారీ వర్షాలకు వాగులు పొంగి బూరుగువాడ-వేపులపాడు గ్రామాల మధ్య ఉన్న బూరుగువాడ కాలువకు గండి పడింది. గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. పిల్లల చదువులు పోతున్నాయని తల్లిదండ్రులు సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లి వారే గండిని పూడ్చారు. గండితో ఆర్టీసీ, స్కూలు బస్సులు నిలిచిపోయాయి. సుమారు 10 గ్రామాల పిల్లలు స్కూలుకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచ్ జోడే సత్యదుర్గప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం ట్రాక్టర్లతో మట్టిని తెచ్చి ఎక్స్‌కవేటర్‌తో గండిని పూడ్చి రహదారిని తాత్కాలికంగా పునరుద్ధరించుకున్నారు.

- బుట్టాయగూడెం

వానాకాలం చదువు


ప్రాథమిక పాఠశాల ఆవరణలో వర్షపు నీరు

వానాకాలం చదువుకు ఎన్నో ఇబ్బందులు. పోలవరం బీసీ కాలనీలో ప్రాథమిక బాలుర పాఠశాల ఆవరణ ఇటీవల వర్షాలకు నీట మునిగింది. గోతుల్లో నీరు బయటకు పోయే మార్గంలేక అపారిశుధ్యం నెలకొంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు పాఠశాల సమీపంలో స్థానికులు గేదెలను కట్టడంతో సమస్య మరింత జఠిలమైంది. పాఠాలు చెబుతుంటే మధ్యలో గేదెల అరుపులు. దోమలు, ఈగలతో విద్యార్థులు అనారోగ్యాలపాలయ్యే అవకాశాలున్నాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

- పోలవరం


ఏలూరు రూరల్ మండలం సమావేశంలో ఏపీడీ పురుషోత్తం, అధికారులు


పెదపాడు ఎంపీడీవో కార్యాలయం వద్ద సోషల్ ఆడిట్ గ్రామసభ

అనర్హులకు పింఛన్లు

సామాజిక తనిఖీలో బయటపడ్డ అక్రమాలు

ఏలూరు రూరల్, జూలై 26: అనర్హులు పింఛన్లు అందుకుంటున్నారు. వైకల్యం లేకున్నా దివ్యాంగుల పింఛన్, భర్తతో విడిగా ఉంటున్న మహిళ వితంతు పింఛన్ పొందుతోంది. పలువురు వృద్ధులు నేతన్న పింఛన్ తీసుకోవడం సామాజిక తనిఖీలో బయటపడడంతో అధికారులు విస్తుపోతున్నారు. ఏలూరు రూరల్ మండలంలో ఉపాధి పథకంలో 2023-24 సంవత్సరం రూ.11.45 లక్షల వ్యయంతో చేపట్టిన 1150 పనులపై సామాజిక తనిఖీ బృందం ఈనెల 15 నుంచి 25 వరకు 14 గ్రామ పంచాయతీల్లో సోషల్ ఆడిట్ నిర్వహించి, గ్రామసభలు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సామాజిక తనిఖీ సభలో ఉపాధి పనులు సక్రమంగా నిర్వహించినట్లు అధికారులు నిర్ధారించారు. ఏపీడీ పురుషోత్తమరావు మాట్లాడుతూ టెక్నికల్ అసిస్టెంట్లు కొన్నిచోట్ల అలసత్వం వహించారని, ఉపాధిపనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు.

అనర్హులు పింఛన్ అందుకోడాన్ని అధికారులు గుర్తించారు. మాదేపల్లిలో వృద్ధాప్య పింఛన్‌కు అర్హుడైన వ్యక్తి దివ్యాంగ పింఛన్ పొందుతున్నాడని గుర్తించారు. కాట్లంపూడిలో మరొక వృద్ధుడు నేతన్న పింఛన్ పొందుతున్నాడని శ్రీపర్రులో భర్తతో విడిగా ఉంటున్న మహిళ వితంతు పింఛన్ పొందుతున్నట్లు ఆడిట్‌లో నిర్ధారించారు. సుధాకర్, అబ్దుల్‌ఖాన్, సూర్యచక్రం, నాగరాజు, ఎంపీడీవో బండి ప్రణవి, ఏపీవో కిషోర్‌కుమార్, సర్పంచ్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.42 వేలు రికవరీ చేయాలి

పెదపాడు: మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో రూ.42 వేలు రికవరీ చేయాల్సి ఉందని అధికారులు నిర్ధారించారు. ఉపాధిహామీ పథకంలో వివిధ గ్రామాల్లో చేపట్టిన పనులు, నిధులు తదితర అంశాలపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించారు. ఎంపీడీవో తేజరతన్ అధ్యక్షతన జరిగిన ఆడిట్‌లో ఏపీడీ సుధాకర్ గ్రామాల వారీగా 2023-24 సంవత్సరానికి సంబంధించి పనులపై సమీక్ష నిర్వహించారు. 23 గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన పనులకు రూ.14,92,15,300 చెల్లింపులు చేశారని, వాటిలో రూ.42,013ల రికవరికీ ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో భాషా, ఎన్‌ఆర్‌జీఎస్ టెక్నికల్, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత ఇసుక అందించి కార్మికుల ఉపాధి కాపాడాలి



సమావేశంలో సీఐటీయూ నేతలు

ఏలూరు కార్పొరేషన్, జూలై 26: ప్రభుత్వం ఉచిత ఇసుకతో కార్మికులకు ఆశ కల్పించిందని, ఆచరణలో ఉచిత ఇసుక అందించడంలో ప్రభుత్వం విఫలమైందని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నారపల్లి రమణారావు విమర్శించారు. సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉచిత ఇసుక ఎవరికీ అందడం లేదని, కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. ఉచిత ఇసుక అందించి కార్మికుల ఉపాధి కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ.ప్రసాద్, సీఐటీయూ నాయకులు మాధవ, రెడ్డి లక్ష్మణరావు, కెల్లా దుర్గాప్రసాద్, సీహెచ్.కొండలరావు, అబ్దుల్ అక్బర్, కానా సాంబశివరావు, చీరా అప్పారావు, పి.వి.నరసింహారావు, సీహెచ్.రాము, కేవీ.శ్రీను తదితరులు ఉన్నారు.

ఆవుల అక్రమ రవాణా : ముగ్గురిపై కేసు

జంగారెడ్డిగూడెం, జూలై 26: ఆవులను అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబసు తెలిపారు. పట్టణంలోని మార్కెట్ యార్డువద్ద పోలీసులు తనిఖీ నిర్వహిస్తుండగా అనుమతి లేకుండా 12 ఆవులను తరలిస్తున్న వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. తుని నుంచి పాయకరావు పేటకు తరలిస్తున్నారన్నారు. ఆవులను హనుమాన్ జంక్షన్‌లోని గోశాలకు తరలించి, వాహనాన్ని సీజ్ చేశామని, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

జంగారెడ్డిగూడెం, జూలై 26: డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న యువతి అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబసు తెలిపారు. శ్రీనివాసపురం గ్రామానికి చెందిన యువతి ఈ నెల 25న కళాశాలకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లేకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన పత్తిపాటి కిరణ్ అనే యువకుడిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు టూటౌన్, జూలై 26: జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లో పని చేస్తున్న అర్హత కలిగిన ఉపాధ్యాయులు జిల్లా స్థాయి అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు. వచ్చే నెల 5 నుంచి 9లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జిల్లా స్థాయి అవార్డు పంక్షన్ నిర్వహిస్తామన్నారు. కనీసం 15 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన ఉపాధ్యాయులు అర్హులన్నారు. గతంలో రాష్ట్ర స్థాయి అవార్డు పొందిన వారు కూడా అర్హులన్నారు. ఆరోపణలు, క్రమశిక్షణ చర్యలు, క్రిమినల్ కేసులు ఉన్నవారు అనర్హులన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు డీఈవో వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు.


ఒలింపిక్ విజయం కోరుతూ ర్యాలీ చేస్తున్న జిల్లా క్రీడాకారులు

క్రీడాకారుల విజయాన్ని కాంక్షిస్తూ ర్యాలీ

ఏలూరు రూరల్, జూలై 26: పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు పతకాలు సాధించి, దేశానికి కీర్తిప్రతిష్ఠలు తేవాలని కాంక్షిస్తూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. జిల్లా క్రీడాప్రాధికారి సంస్థ, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, క్రీడాకారులు, శిక్షకులు తరపున అల్లూరి సీతారామ స్టేడియం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. ర్యాలీని ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బడేటి వెంకట్రామయ్య ప్రారంభించారు. 400 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి ప్రసాద్, సాయిశంకర్, శిక్షకులు, జిల్లా ప్రాధికార సంస్థ కోచ్ శ్రీనివాసరావు, జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డుల అర్హుల జాబితా అందజేత

ఏలూరు రూరల్, జూలై 26: వ్యవసాయ భూములను కౌలుకు తీసుకుని సాగుచేస్తున్న రైతులు వీఆర్వో ద్వారా సీసీఆర్‌సీ కార్డు తీసుకోవాలని ఏవో జీవన సంధ్య సూచించారు. రూరల్ మండలంలోని సీసీఆర్‌సీ అర్హుల జాబితాను ఆర్‌ఆర్ పేట ఇండియన్‌బ్యాంకు, ఎన్‌ఆర్‌పేటలోని ఇండియన్ బ్యాంకు మేనేజర్లకు శుక్రవారం అందజేశారు. కౌలు రైతులు వ్యవసాయ శాఖ నుంచి బ్యాంకు నుంచి రుణాలు, పంట నష్టపరిహారం పొందాలంటే సీసీఆర్‌సి కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా అర్హుల జాబితాను బ్యాంకులకు అందజేసినట్లు ఆమె తెలిపారు.

ఉద్యోగులపై కేసుల ఎత్తివేత.. నేతల హర్షం

ఏలూరు రూరల్, జూలై 26: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులపై ఎత్తివేయడంపై ఏపీటీఎఫ్ (1938) నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లాశాఖ తరపున ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జీవోనెంబర్ 117 రద్దుచేసి 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు ఒకేచోట ఉండేవిధంగా చేయాలని, తెలుగు, ఇంగ్లీష్ మీడియంతో ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలని కన్వీనర్ కృష్ణ, జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు రత్నంబాబు, మోహన్ విజ్ఞప్తి చేశారు.

జగన్‌ను ప్రజలు తిరస్కరించారు

జంగారెడ్డిగూడెం, జూలై 26: జగన్‌ను ప్రజలు తిరస్కరించారని గుర్తుంచుకోవాలని టీడీపీ సీనియర్ నేత మండవ లక్ష్మణరావు అన్నారు. కూటమి ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రాలను తప్పుపట్టిన జగన్ తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికీ అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతూ, బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్న జగన్ తన తీరు మార్చుకోవాలన్నారు.



మల్కాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


పోలవరంలో డ్రైడే కార్యక్రమంలో మురుగు పరిశీలిస్తున్న సిబ్బంది

దోమల నిర్మూలన సామాజిక బాధ్యత కావాలి

ఏలూరు రూరల్, జూలై 26: దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికున్ గున్యా సంక్రమించే అవకాశం ఉందని, దోమల నిర్మూలన సామాజిక బాధ్యతగా భావించాలని జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. చాటపర్రు ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మల్కాపురంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. వర్షాకాలంలో జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యులచే పరీక్షించుకుని చికిత్స పొందాలన్నారు. మలేరియా అధికారి గోవిందరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రామాంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్ కిరణ్, శ్రీనివాసరావు, జోషి, పావని, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంహెచ్‌వో డాక్టర్ మాలతి తెలిపారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా 37వ డివిజన్‌లో పారిశుధ్య పనులు నిర్వహించారు. స్ప్రేయింగ్, ఫాగింగ్, నిల్వ నీటిలో ఆయిల్‌బాల్స్ వేస్తున్నామన్నారు. గుబ్బలవారి వీధి, రంగూన్‌మేడ, అతిధి హోటల్, రాఘవాచారి రోడ్లు తదితర ప్రాంతాల్లో శుభ్రం చేశామన్నారు. టీడీపీ నాయకులు నాయుడు సోము, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాలస్వామి, సూపర్‌వైజర్ దుర్గారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్టీఫెన్‌రాజు, ఆశాకార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

● పోలవరం: జగన్నాథపేటలో శుక్రవారం వైద్య సిబ్బంది ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. నీటి నిల్వలు ఉన్న ప్రాంతాలు పరిశీలించి దోమల వలన ప్రబలే వ్యాధులు, నివారణ అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించా ఎంపీహెచ్‌ఈవో గుగ్గులోతు సోమరాజు, హెచ్‌వి గంగాభవాని, విశ్వనాథ్, ఏఎన్ఎం జ్యోతి, ఆశా వర్కర్లు అత్తిలి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పోలవరం మండల కేంద్రంలో వర్షాలకు నీరు నిల్వ ఉన్నచోట దోమలతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో జగన్నాథపేట, బెస్తావీధి, కొత్తపేట, బాపూజీ కాలనీ, బీసీ కాలనీ, కమ్మర గూడెం, ఏనుగులవారి వీధి, గణేశ్‌నగర్, పాతపోలవరం, పెదరామాలయం వీధి ప్రాంతాలలో దోమలు ఎక్కువగా ఉన్నాయని మలేరియా సబ్ యూనిట్ అధికారులు స్పందించి పంచాయతీ పరిధిలో దోమల నివారణకు మలాథియాన్ స్ప్రేయింగ్ పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.


కార్గిల్ విజయోత్సవ ర్యాలీ ప్రారంభిస్తున్న కరాటం రాంబాబు

మాజీ సైనికోద్యోగుల కార్గిల్ విజయోత్సవ ర్యాలీ

జంగారెడ్డిగూడెం, జూలై 26: కార్గిల్ యుద్ధంలో అమర జవాన్ల త్యాగాలు మరువలేనివని డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు అన్నారు. మాజీ సైనికోద్యోగులు శుక్రవారం నిర్వహించిన కార్గిల్ విజయోత్సవ ర్యాలీని కరాటం రాంబాబు ప్రారంభించారు. కొవ్వొత్తులతో పట్టణంలో ర్యాలీ చేశారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న జూలూరి రాఘవరావు, పండూరి నాగేశ్వరరావు, దమ్మల గోపాలకృష్ణ, దొమ్మేటి సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. సీఐ పి.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

అమర వీరులకు ఘన నివాళి

దెందులూరు, జూన్ 26: కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన అమర జవాన్లకు డీఈడీ, నర్సింగ్ కళాశాల విద్యార్థులు నివాళులర్పించారు. యుద్ధంలో పాకిస్తాన్‌పై భారత సైన్యం విజయం సాధించడం గర్వకారణమని కార్గిల్ విజయ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

భీమడోలులో..


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ గిరిజాకుమారి

భీమడోలు: కార్గిల్ యుద్ధంలో దేశం తరపున పోరాడి అమరవీరులైన జవాన్ల సేవలను ప్రతి విద్యార్థి స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్ఈబీ సీఐ గిరిజా కుమారి అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్గిల్ విజయ దివస్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమర వీరులకు నివాళులర్పించారు. అశోక్, కేసరి, బాలు పాల్గొన్నారు.

బాలికలు రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


సదస్సులో మాట్లాడుతున్న సీఐ క్రాంతికుమార్

టి.నరసాపురం, జూలై 26: పాఠశాల స్థాయి నుంచి బాలికలు రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ టి.క్రాంతికుమార్ సూచించారు. జడ్పీ హైస్కూలు విద్యార్థులకు పోక్సో ఇతర చట్టాలు, నేరాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలు, చిన్నారుల రక్షణకు ప్రభుత్వం పటిష్ఠమైన చట్టాలు అమలు చేస్తుందన్నారు. బాలికలందరూ గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, వేధించినా వెంటనే తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు చెప్పాలని వేధింపులు ఎక్కువైతే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఎస్సై డి.దుర్గా మహేశ్వరరావు, హెచ్ఎం లింగుస్వామి, కృష్ణారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి: మహిళల సంరక్షణ, అభివృద్ధి మిషన్ శక్తి కార్యక్రమం లక్ష్యమని పెదవేగి సర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి అన్నారు. మహిళలపై లైంగిక వేధింపులు, దాడుల నివారణ చట్టాలపై అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలపై దాడులను అరికట్టడానికి అందరూ సహకారం అందించాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్.పార్వతి, మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం.జ్యోతి, ఏఎన్ఎం మౌనిక, అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, అనూరాధ, మల్లిక, ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

● దెందులూరు: విద్యార్థులు, బాలలు రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులను తెలుసుకోవాలని సీడీపీవో కె.విజయలక్ష్మి అన్నారు. పోతునూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో రక్షణ చట్టాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల సంరక్షణ లీగల్ వలంటీర్ ఐ.కృష్ణవేణి, సీడీపీవో విజయలక్ష్మి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. హైస్కూల్ హెచ్ఎం షేక్‌వలీ, అంగన్వాడీ సెక్టార్ సూపర్‌వైజర్లు చిట్టెమ్మ, కె.శ్రీదేవి, పద్మ భూషణం పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా అధ్యక్షతన బాలికల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ పి.రాజేష్ మహిళలు, బాలికల చట్టాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో కేవీ.ప్రసాద్, హెచ్ఎం టి.ప్రశాంతి, న్యాయవాది హిమబిందు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి త్రినాథ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, పాల్గొన్నారు.

చట్టాలపై అందరికీ అవగాహన అవసరం

ఏలూరు క్రైం, జూలై 26 : రక్షణ చట్టాలపై అందరికీ అవగాహన అవసరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అశోక్‌నగర్ ఎస్‌పీడీబీటీ జూనియర్ కళాశాల విద్యార్థినులకు మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రత్నప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థినులు హక్కులను పరిరక్షించుకోవాలన్నారు. ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, సమాజ పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలన్నారు. సీడీపీవో ఎ.పద్మావతి, ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, రాఘవమ్మ మాట్లాడారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ మున్సిపల్ హైస్కూలులో కిశోర బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించారు. వెంకటేశ్వరరావు, హెచ్ఎం కృష్ణభగవాన్, ఎం దేవీమౌనిక, మీనాక్షి పాల్గొన్నారు.

కార్గిల్ విజయ్ దివస్

»అమర వీరులకు నివాళి » విశ్రాంత సైనికులకు సత్కారం



నూజివీడులో అమర వీరులను స్మరిస్తూ ర్యాలీ

నూజివీడు టౌన్, జూలై 26: కార్గిల్ విజయాన్ని గుర్తు చేస్తూ నియోజకవర్గ బీజేపీ ఆధ్వర్యంలో నూజివీడు మండలం మీర్జాపురంలో మాజీ సైనికుడు సాంబశివరావును బీజేపీ నాయకులు ఘనంగా సత్కరించారు. బీజేపీ నూజివీడు మండల అధ్యక్షుడు గోగినేని శ్రీనివాస కుమార్ అప్పారావు, సీనియర్ నాయకురాలు శివరాజు వసుంధరా దేవి, వైఎస్ దొర్రై తదితరులు పాల్గొన్నారు. నూజివీడులో అమర వీరులను స్మరిస్తూ లయన్స్ క్లబ్ ఆఫ్ నూజివీడు గ్రేటర్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. దేశ రక్షణకు అమర వీరుల త్యాగాలను గుర్తుచేసుకున్నారు. కృష్ణ ప్రసాద్, కొప్పుల రంగారావు, అనంత లక్ష్మి, అనూరాధ, ఈమని శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



కలిదిండిలో మాజీ సైనికుడు డేవిడ్ రాజుకు ఉపాధ్యాయుల సత్కారం



మీర్జాపురంలో మాజీ సైనికుడికి సత్కారం

కలిదిండి: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికుడు జంగం డేవిడ్ రాజును శుక్రవారం ఆరుతెగలపాడు హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు సత్కరించారు. టీడీపీ నాయకుడు డేవిడ్ రాజు మాట్లాడుతూ యుద్ధంలో పాల్గొనే అవకాశం అందరికీ దొరకదని కార్గిల్ యుద్ధంలో పాల్గొనే అవకాశం తన దొరకటం అదృష్టంగా భావిస్తునన్నారు. యుద్ధంలో చాలా మంది సైనికులు క్షతగాత్రులయ్యారని, దేశం కోసం ప్రాణాలు అర్పించారన్నారు. యుద్ధంలో విజయం సాధించటం పట్ల గర్వంగా ఉందన్నారు. ఆర్మీలో చేరేందుకు యువత ముందుకు రావాలన్నారు.

కైకలూరు సమస్యలు సీఎంకు తెలిపిన కామినేని



కైకలూరు, జూలై 26: కొల్లేరు ప్రజల జీవనో పాధిని మెరుగుపరిచేం దుకు శాశ్వత పరిష్కారం చూపాలని సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లినట్లు కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో కొల్లేరు, తాగునీరు, టీచర్ల కొరతపై అసెంబ్లీలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. కొల్లేరు ప్రజలకు జీవనోపాధి కల్పించేందుకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంటూరు కుదించాలని చంద్రబాబును కోరారు. గ్రామాల్లో మంచినీటి సౌకర్యాలు మెరుగుపరిచాలని, కైకలూరు నియోజకవర్గంలో టీచర్ల కొరత ఉన్నందున ఈ విద్యాసంవత్సరంలో పిల్లలు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని, తక్షణమే పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని నాయకులను కోరినట్టు తెలిపారు.

మంత్రి పార్థసారథిని కలసిన వీరమల్లు



ముదినేపల్లి, జూలై 26 : రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి కొలుసు పార్థసారథిని కైకలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహా రావు మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం మంత్రిని విజయవాడలోని ఆయన నివాసంలో కలసి నియోజకవర్గంలో గృహ నిర్మాణాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. గత నాలుగేళ్లుగా గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు కోట్లాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రికి చెబుతూ అందుకు సంబంధించిన నిధులు విడుదల చేయాలని కోరారు.

నేడు ముదినేపల్లిలో రక్తదాన శిబిరం

ముదినేపల్లి, జూలై 26 : ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం ముదినేపల్లిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ పుట్టిన రోజు సందర్భంగా ఈ రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు.

మత్స్యకారుల హర్షం



కలిదిండి, జూలై 26 : మత్స్యకారుల మెడకు ఉరితాడులా ఉన్న జీవో 217ను రద్దు చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించటం పట్ల మత్స్యకారులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మట్టగుంటలో విలేకరుల సమావేశంలో మత్స్యకారుల సంఘం రాష్ట్ర నాయకుడు అంద్రాజు శ్రీనివాస్ మాట్లాడుతూ జీవో నెంబర్ 217 చంద్రబాబు, పవన్ కల్యాణ్ జీవో రద్దు చేస్తామన్న హామీ మేరకు అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి అచ్చెన్నాయుడు జీవో రద్దు చేస్తామని ప్రకటించటంతో మత్స్యకారులంతా ఆనందం వ్యక్తం చేస్తుతన్నారన్నారు. మత్స్యకారుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే వ్యాధులకు చెక్

కైకలూరు జూలై 26 : డెంగీ నివారణలో అందరూ భాగస్వాములు కావాలని ఎంఈవో-2 వి. శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం తామరకొల్లు జడ్పీ హైస్కూల్లో డెంగీ నివారణపై సీతనపల్లి పీహెచ్‌సీ సిబ్బంది, విద్యాశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఇళ్ల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయవద్దని సూచించారు. అనంతరం వేమవరప్పాడు ఎంపీ యూపీ స్కూల్లో ఆరోగ్యంపై అవగాహన సదస్సును నిర్వహించారు.



ముసునూరులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి బాషా



కౌలు రైతుల జాబితాను బ్యాంకు మేనేజర్‌కు అందిస్తున్న షేక్ జరీనా

ప్రతి కౌలు రైతుకు రుణాలే లక్ష్యం

ముసునూరు, జూలై 26: అర్హులైన ప్రతి కౌలు రైతుకు రుణాలను అందించడమే లక్ష్యమని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌కె హబీబ్ బాషా అన్నారు. శుక్రవారం ముసునూరులో ఎస్‌బీఐ, సప్తగిరి, కేడీసీసీ బ్యాంక్‌ల మేనేజర్లతో ఆయన సమావేశమై మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డులు ఉన్న కౌలు రైతులకు పంట రుణాలివ్వాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 75 వేల మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు అందజేయడం లక్ష్యం కాగా ఇప్పటివరకు 45 వేల మందికి జారీ చేశామన్నారు. తహసీల్దార్ జవహర్ బాజి, నూజివీడు ఏడీఏ విద్యాసాగర్, ఏవో ఎస్.మధుమోహన్, వీఆర్వో మస్తాన్‌రావు, ఏఈవో రామకృష్ణ, టీడీపీ నాయకులు కొండేటి బాజి, నక్కా యోహాను, విహెచ్‌ఏలు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: కౌలు రైతులకు పంట రుణాలు అందించాలని నూజివీడు మండల ఏవో ఎ. చాముండేశ్వరి అన్నారు. గొల్లపల్లి, మీర్జాపురం, యలమదల, పల్లెర్లమూడి గ్రామాల్లోని బ్యాంకర్లకు కౌలు రైతుల జాబితాలను అందించారు. మండలంలో ఇప్పటి వరకు 2677 సీసీఆర్‌సీ కార్డులను మంజూరు చేసినట్లు చెప్పారు. వీటి ద్వారా పంట నమోదు, క్రాప్ ఇన్సూరెన్స్ పొందే అవకాశం ఉంటుందన్నారు.

చాట్రాయి: కౌలు రైతులకు పంట రుణాలిచ్చి వారికి అండగా నిలవాలని ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా శుక్రవారం స్థానిక ఎస్‌బీఐ, సప్తగిరి బ్యాంకు అధికారులను కలసి విజ్ఞప్తి చేశారు. మండలంలోని కౌలు రైతుల జాబితాలను డీఏవో బ్యాంకు అధికారులకు అందజేశారు. అనంతరం ఎంఏవో ఆఫీస్‌లో మండలంలో కౌలు రైతుల గుర్తింపు కార్డుల జారీపై సమీక్షించారు. ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేసి నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. చాట్రాయి, జనార్దనవరం గ్రామాల్లో లైన్ పద్ధతిలో ఊడ్చిన వరి పంటను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఆయన వెంట నూజివీడు ఏడీఏ విద్యాసాగర్, ఏవో శివశంకర్ వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

మండవల్లి: కౌలు రైతులకు త్వరితగతిన రుణాలు అందించాలని మండల వ్యవసాయాధికారిణి షేక్ జరీనా బ్యాంకు అధికారులను కోరారు. మండలంలోని అన్ని బ్యాంకుల మేనేజర్లను శుక్రవారం కలసి కౌలు రైతుల జాబితాను అందజేశారు. గ్రామంలో పొలాలను ఆమె పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. పచ్చిరొట్ట పెంచి భూమిలో కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందని తెలిపారు. వీఏఏలు వర్మ, సంధ్య, సుబాని పలువురు రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేసినా.. చూసినా జైలే



కైకలూరులో మాట్లాడుతున్న న్యాయసేవాధికారిణి వీవీఎస్‌వీ లక్ష్మి

కైకలూరు జూలై 26 : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అవి చేసినవారికి, చూసినవారికి చట్టరీత్యా రెండేళ్ల జైలుశిక్ష పడుతుందని కైకలూరు సీనియర్ న్యాయాధికారిణి వీవీఎస్‌వి లక్ష్మి అన్నారు. శుక్రవారం కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో మిషన్ శక్తిపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ మహిళల కోసం అనేక చట్టాలున్నాయని, విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాల కార్మికులతో పనులు చేయించడం నేరమని అలాగే బాలికలను వేధించినా, ఎవరైనా వివక్ష చూపినా అధికారులు, పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అవగాహన కల్పించాలన్నారు. అలాగే వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్ నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి దీప్తి, సూపర్‌వైజర్లు లావణ్య, కృష్ణకుమారి, న్యాయవాదులు పి. పవన్‌కాంత్, శివప్రసాద్, అధ్యాపకులు నున్న శ్రీనివాసరావు, జ్ఞానప్రసూనాంబ పాల్గొన్నారు.

చెడుకు దూరంగా ఉండాలి

నూజివీడు టౌన్: సామాజిక మాధ్యమాల్లో మంచి చెడులను గుర్తించి చెడుకు దూరంగా ఉండాలని నూజివీడు సీడీపీవో షేక్ నూరాని అన్నారు. నూజివీడు బాలికోన్నత పాఠశాలలో 100 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థినులకు అవగాహన సదస్సును నిర్వహించారు. బాలికా సంరక్షణకు ఎన్నో చట్టాలున్నా మన నడవడిక పైనే మన భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు. వన్ స్టాప్ సెంట్రల్ అడ్మిన్ సీహెచ్. నిర్మల గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై, ప్రముఖ న్యాయవాది నందూరి పద్మాంజలి పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఏసీడీపీవో నాగేశ్వరి, సూపర్‌వైజర్ కె.ధనలక్ష్మి పాల్గొన్నారు.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

ముసునూరు: కిశోర బాలికలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు రావని ఐసీడీయస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. ఐసీడీయస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై జరుగుతున్న 100 రోజుల ప్రత్యేక అవగహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ముసునూరు జడ్పీ, చింతలవల్లి ఎంపీ యూపీ పాఠశాలల్లో బాలికలకు పౌష్టికాహారం, చట్టాలపై ఆమె అవగహన కల్పించారు. బాల్య వివాహాలు చేసుకున్నా, పోత్సహించినా నేరమన్నారు. ఆడపిల్లలపై అఘాయిత్యాల నివారణకు ప్రభుత్వం నూతన చట్టాలను తీసుకువచ్చిందని, వీటిపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాలను అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించారు. హెచ్‌ఎంలు ఏ.సునీల, రామరాజేశ్వరి, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



రికవరీ చేసిన సెల్‌ఫోన్లు
బాధితుడికి ఫోన్ అందిస్తున్న ఏలూరు ఎస్పీ కిశోర్

రూ.21 లక్షల విలువైన ఫోన్లు రికవరీ

ఏలూరు క్రైం, జూలై 26 : జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఫిబవరి నుంచి ఏప్రిల్ నెల వరకు జరిగిన సెల్ ఫోన్ చోరీలకు సంబంధించిన 151 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్టు ఏలూరు జిల్లా ఎస్పీ కిషోర్ చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులకు వివరాలను ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ స్వరూపరాణి వెల్లడించారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారికోసం ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నెంబర్ 95503 51100కు ఫిర్యాదులు చేయడంతో ఏలూరు సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు సీసీఎస్ సిబ్బంది, దర్యాప్తు చేపట్టి 151 ఫోన్లను రికవరీ చేశారు. వీటి విలువ 21 లక్షల 14 వేల రూపాయలని తెలిపారు. ఏలూరు, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్ జిల్లా, అంబేడ్కర్ కోనసీమ, కృష్ణా, విశాఖపట్టణం, తూర్పుగోదావరి, విజయనగరం, విశాఖ, తెలంగాణా తదితర ప్రదేశాల నుంచి మొబైల్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, బ్యాంకులు, ఏటీఎంలు, రైతు బజార్లు, రద్దీ ప్రదేశాల్లో ప్రజలను దృష్టి మళ్ళించి మొబైల్స్ దొంగిలిస్తుస్తారన్నారు. ప్రజలు తమ సెల్‌ఫోన్‌లో సమాచారాన్ని ఎప్పటికప్పుడు బ్యాకప్ చేసుకోవాలని సూచించారు. యాప్‌లక పాస్‌వర్డ్ రక్షణ కల్పించుకుని ఫైండ్‌మై డివైజ్ ఆప్షన్ పెట్టుకోవాలన్నారు. సెల్‌ఫోన్లు రికవరీ చేసిన ఏలూరు సీసీఎస్ సీఐ మురళీకృష్ణ, సైబర్‌క్రైం ఎస్ఐ రాజాలను అభినందించారు. ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు సెల్‌ఫోన్లను అప్పగించారు.

ఆశ పడవద్దు..భయపడవద్దు : ఎస్పీ

ఆశ, భయం వల్ల ప్రజలు సైబర్ నేరాల బారినపడుతున్నారని ఎస్పీ కిషోర్ అన్నారు. ఈ రోజు ప్రతి ఒక్కరికి మొబైల్ ఫోన్ నిత్యావసరంగా మారిందని అన్నారు. నేరగాళ్ళు వివిధ రకాల యాప్‌లను తయారు చేసి ఆండ్రాయిడ్ ఫోన్లకు పంపించి ఆశ కల్పిస్తున్నారన్నారు. ఇంటి వద్దే ఉండి పార్ట్‌టైమ్‌గా జాబ్ చేసుకోవచ్చుని, రోజుకు వేలాది రూపాయలు సంపాదించవచ్చునని లేదా లాటరీలో సొమ్ము వచ్చిందనో, గిఫ్టులు వచ్చాయనో, ప్రైజ్ మనీ వచ్చిందనో ఆశ చూపించి తాము పంపిన లింకులను క్లిక్ చేసి బ్యాంకు వివరాలు, ఆధార్‌కార్డు వంటివి పంపించాలని కోరుతున్నారు. కొంతమంది ఆశతో ఆ లింకులను ఓపెన్ చేస్తున్నారని దీంతో ఆ ఫోన్ డేటా అంతా నేరస్తుల గుప్పెట్లోకి వెళ్ళిపోతుందని దీంతో వారి అకౌంట్ లోని సొమ్ములను తస్కరిస్తున్నారన్నారు. కొంతమంది సైబర్ నేరగాళ్ళు వీడియో కాల్స్‌చేసి తాము కస్టమ్స్ అధికారులమనో, ఇతర పోలీసు అధికారులమనో, ఏసీబీ అధికారులమని బెదిరిస్తున్నారని ఇలాంటి వాటికి భయపడిన కొంతమంది వారు చెప్పినట్లు సొమ్ములు చెల్లించుకుని ఆ తరువాత లబోదిబోమంటూ పోలీసులు ఆశ్రయిస్తున్నారన్నారు. ఇలాంటి కాల్స్ వస్తే సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయా లన్నారు. ఎవరైనా మొబైల్ ఫోన్లను పోగొట్టుకుంటే టోల్ ఫ్రీ నెంబర్ 95503 51100కు ఫిర్యాదు చేయాలని సూచించారు.



ధర్నా చేస్తున్న గ్రామస్థులు, మృతుడి బంధువులు (ఇన్‌సెట్) రామకృష్ణ (ఫైల్)

ఆత్మహత్యకు కారకులను అరెస్ట్ చేయాలి

సానారుద్రవరం గ్రామానికి చెందిన ఒకరి అనుమానాస్పద మృతి
కైకలూరులో మృతుడి బంధువులు, గ్రామస్థుల ఆందోళన
ఎమ్మెల్యే కామినేని చొరవతో సమసిన వివాదం

కైకలూరు/కలిదిండి, జూలై 26 : వ్యక్తి ఆత్మహత్యకు వేధింపులే కారణమని పలువురిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ తక్షణమే వారిపై కేసులు నమోదు చేయాలని మృతుడి బంధువులు, గ్రామస్థులు ఆందోళన చేశారు. శుక్రవారం కైకలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద జాతీయ రహదారిపై కొద్దిసేపు ఈ ఆందోళన జరిగింది. కలిదిండి మండలం సానారుద్రవరం గ్రామానికి చెందిన విన్నకోట రామకృష్ణ(40) గురువారం అర్ధరాత్రి గ్రామంలో వేపచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఇతను గ్రామంలో మట్టి వ్యాపారం, కూలి పనులు చేసుకుంటూ ఉంటాడు. కొద్ది రోజుల క్రితం సానారుద్రవరంలో బుసక తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను, బుసక లోడు లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొంతమంది రాజకీయ నాయకులు, తోటి వ్యాపారులు కక్షతో ఎక్స్‌కవేటర్‌ను, బుసక లోడు లారీని సీజ్ చేయించి వేధించటంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్టు మృతుడి భార్య ఆరోపించింది. పోస్టుమార్టం నిమిత్తం రామకృష్ణ మృతదేహాన్ని శుక్రవారం ఉదయం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించడంతో గ్రామం నుంచి పెద్దఎత్తున బంధువులు, గ్రామస్థులు ప్రభుత్వాసుపత్రికి చేరుకొని వేధింపుల వల్లే అతను మృతి చెందాడని నిందితులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్థులు పెద్దఎత్తున చేరుకోవడంతో పోలీసులు కూడా భారీగా చేరుకున్నారు. కేసు నమోదు చేసి ఆత్మహత్యకు కారకులైన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై ఆందోళన చేశారు. ఈ దశలో పోలీసులు, గ్రామస్థులకు మధ్య వాగ్వాదం జరిగింది. విషయం కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఫోన్‌లో ఆయన మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని ఎవరూ ఆందోళన చేయవద్దని హామీ ఇవ్వడంతో వివాదం సద్దు మణిగింది. ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ మృతుడి భార్య సుధారాణి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

క్రైం సమాచారం

పొలంగట్టు తగాదా..హత్య

పెదవేగి, జూలై 26: ముంపునకు గురైన వరిపొలంలో నీటిని బయ టకు పంపించే దగ్గర ఏర్పడిన వివాదం చిలికి చిలికి హత్యకు దారితీసింది. పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్ర ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం కూచింపూడికి చెందిన కలపాల ఏసు, అతని సమీప బంధువులైన రమేష్, మరికొందరికి గ్రామానికి ఆనుకుని వరి పొలాలు ఉన్నాయి. అన్న దమ్ముల పొలాలు కావడంతో వర్షం వచ్చిన సమయంలో ఒకరి పొలం నుంచి మరొకరి పొలంలోకి మురుగునీరు పారుతుంది. ఏసు పొలం పల్లపు ప్రాంతంలో ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాలతో పొలాలు నీటి ముంపునకు గురయ్యాయి. ముంపునీటిని దిగు వునకు పంపించే విష యంలో ఏసుతో అతనికి సమీప బంధు వులైన రమేష్,అతని సోదరుడు అచ్చియ్యలు శుక్రవారం రాత్రి ఇంటి దగ్గర ఘర్షణ పడ్డారు. పొలంలో అడ్డుగా వేసిన కట్టను తీసి వేస్తానని రమేష్, అతని సోదరుడు అచ్చియ్యలు గ్రామానికి సమీపంలోనే ఉన్న పొలానికి వెళ్లారు. దీనిపై ఆగ్రహంతో ఉన్న ఏసు, అతని సోదరుడు అచ్చిరాజు కూడా వారి వెంటే వెళ్లారు. అడ్డు వేసిన కట్టను తొలగిస్తున్న అచ్చియ్యపై ఏసు కత్తితో దాడి చేశాడు. తన తమ్ముడిని చంపే స్తున్నాడే ఆందోళనతో ఏసుపై రమేష్ కత్తితో దాడిచేశాడు. ఈ దాడిలో ఏసు (40) మెడపై తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందు కున్న నూజివీడు డీఎస్పీ జి.లక్ష్మయ్య ఆదేశాలతో పెదవేగి సీఐ కె.శ్రీనివాస్‌కుమార్, ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకు న్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ఏలూరు ప్రభు త్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

ఇరువర్గాల దాడులు..

నూజివీడు టౌన్, జూలై 26: భూమి విక్రయ విషయమై ఇరువర్గాల మధ్య జరిగిన దాడిలో ముగ్గురు గాయాలపాలైన సంఘటన నూజివీడు మండలం గొల్లపల్లి శివారు వేంపాడు అగ్రహారంలో శుక్రవారం చోటుచేసుకుంది. నూజివీడు రూరల్ ఎస్సై శ్రీనివాసరావు వివరాల ప్రకారం భూమి విక్రయం విషయమై తాడి స్వామి, దుర్గాప్రసాద్, చుక్కమ్మ, టి. వెంకన్న, మరో 15 మంది వేంపాడు గ్రామానికి చెందిన కరణం శశిరేఖ, పిశాని రాములమ్మ, మణికంఠ, తమ్మినేని లక్ష్మీ రంగనాథం, డి. పద్మ ధనరాజు, పద్మలపై కర్రలతో దాడి చేయటంతో ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారని చెప్పారు. నూజివీడు రూరల్ పోలీసులకు సమాచారం అందటంతో సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ అయిన 24 గంటల్లో నిందితుల అరెస్టు

చాట్రాయి, జూలై 26: సూరంపాలెంలో నివాసం ఉంటున్న షేక్ రమాదేవి గురువారం ఇంటికి తాళం వేసి పనిమీద విస్సన్నపేట వెళ్ళి తిరిగి వచ్చేటప్పటికి తాళం పగులగొట్టి బంగారు నగలు, నగదు చోరీ చేశారు. వెంటనే ఆమె చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం చాట్రాయి సమీపంలో అదే గ్రామానికి చెందిన నిందితులు కురాటి సిద్ధార్థ, సాధు మధుబాబు, కోలేటి హేమంత్‌లను అరెస్ట్ చేసి వారి నుంచి నగలు, నగదు మొత్తం రూ. 1.60 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై కేసీహెచ్ స్వామి వివరాలు వెల్లడించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ పీవీవీ దుర్గా ప్రసాద్

నూజివీడు టౌన్, జూలై 26: నూజివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా రిజిస్ట్రార్ పీవీవీ దుర్గా ప్రసాద్ తనిఖీ చేశారు. కంప్యూటర్ రికార్డులను పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పరిశీలించినట్టు ఆయన తెలిపారు. నూజివీడు సబ్ రిజిస్ట్రార్ తులసి రత్నం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు విడుదల చేయాలి

చాట్రాయి, జూలై 26: రబీ ధాన్యం బకాయిలను వెంటనే విడుదల చేసి తమను ఆదుకోవాలని మండలంలోని పోలవరం గ్రామ రైతులు ప్రభుత్వాన్ని వేడుకొంటున్నారు. 5 నెలల క్రితం ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రానికి ధాన్యం అమ్మామని, ఈ గ్రామంలో 43 మంది రైతులకు రూ. 41 లక్షలు రావాల్సి ఉన్నదని, ఇంత వరకు సొమ్ము విడుదల కాలేదని, ఖరీఫ్‌కు పెట్టుబడులు లేక అప్పులు పుట్టక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తమకు ధాన్యం బకాయిలు విడుదల చేసి ఆదుకోవాలని బాధిత రైతులు రాజులపాటి శ్రీనివాసరావు, పోలంపల్లి నాగరాజు తదితరులు కోరుతున్నారు.

విద్యార్థులకు మొక్కల పంపిణీ

ఆగిరిపల్లి, జూలై 26: ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం డీపీఆర్‌టీయూ ఆగిరిపల్లి మండల శాఖ ఉచితంగా మొక్కలు అందజేసింది. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్టు అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి వంశీ వశిష్ఠ తెలిపారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపాలి



చాట్రాయి, జూలై 26: ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలలకే తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించాలని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. చనుబండ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మోరంపూడి స్కూల్ బ్యాగ్స్ అందజేసి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిచ్చి డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టిందని, ప్రభుత్వ పాఠశాలలో కూడా కార్పొరేట్ విద్యను అందించటానికి కృషి జరుగుతున్నదన్నారు. ఉపాధ్యాయిని షెహనాజ్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఏకాంబరాచారి పాల్గొన్నారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

ముసునూరు, జూలై 26: మండలంలోని పాఠశాలల్లో శుక్రవారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదును సమాఖ్య నాయకులు నిర్వహించారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు, మండల అధ్యక్షుడు కాసాని గాంగేయుడు, ప్రధాన కార్యదర్శి జి.పద్మకిషోర్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో సుమారు 60 మంది ఉపాధ్యాయులు యూటీఎఫ్ సభ్యత్వాన్ని స్వీకరించారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ముసునూరు, జూలై 26: పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నూజివీడు డీఎల్‌పీవో సుందరి హెచ్చరించారు. శుక్రువారం గోపవరం, కాట్రేనిపాడు, వేల్పుచర్ల గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చెత్తాచెదారం తొలగింపు, డ్రెయినేజీల పూడికతీత, మంచినీటి ట్యాంకుల్లో నీటి పరీక్షలు, మురుగు ప్రదేశాల్లో బ్లీచింగ్ పనులను డీఎల్‌పీవో పరిశీలించి పంచాయతీ అధికారులు, సిబ్బందికి సూచనలిచ్చారు. పారిశుధ్యంపై స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీపుకుంటామని హెచ్చరించారు. సర్పంచ్‌లు కంచర్ల వాణి, గద్దల సుహాసిని, పుట్ల మోహన్‌రావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

చాట్రాయి, జూలై 26: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు గ్రామాల్లో వీధులు బురదకయగా మారి అపరిశుభ్రత తాండవిస్తుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో పంచాయతీల ఆధ్వర్యంలో స్థానిక అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టారు. శుక్రవారం చాట్రాయి, చనుబండ, చిత్తపూరు, చిన్నంపేట, చీపురుగూడెం తదితర గ్రామాల్లో వీధులు శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేడి ఆహారం మాత్రమే తినాలని, దోమతెరలు వాడాలని ప్రజలకు అధికారులు సూచించారు. సర్పంచ్ తిరువీధి రమేష్, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, లక్ష్మీనారాయణ, పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

వైశ్య ప్రముఖుడు నారాయణరావు మృతి



ఆగిరిపల్లి, జూలై 26: ఆగిరిపల్లి వైశ్యప్రముఖుడు మడుపల్లి నారాయణరావు శుక్రవారం ఉదయం మరణించారు. అనారోగ్యం కారణంగా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్ళి అక్కడే తుదిశ్వాస విడిచారని ఆయన కుమారుడు, టీడీపీ నూజివీడు సమన్వయ కమిటీ సభ్యుడు మడుపల్లి గోపాల్ తెలిపారు. ఆయన మృతికి ఆగిరిపల్లి పట్టణ ఫ్యాన్సీ సంఘ ప్రెసిడెంట్ మానేపల్లి జగదీశ్వరరావు, కిరాణా సంఘ అధ్యక్షుడు కల్లూరు ముక్తేశ్వరరావు, టీడీపీ గ్రామ నాయకులు సంతాపం తెలిపారు.

సాహు జయంతి వేడుకలు

మండవల్లి జూలై 26 : మండవల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండవల్లిలో ఛత్రపతి సాహూ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాహూ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘ గౌరవ అధ్యక్షుడు, ఎల్ఎస్ భాస్కరరావు, చాబత్తిన విజయ్, కె. శాంతరాజు, సలహాదారు గోరింక గాంధీ, కార్యదర్శి కె. రవివరప్రసాద్, కోశాధికారి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ చొరవతో డ్రెయినేజీల సమస్య పరిష్కారం



ముసునూరు, జూలై 26: ముసునూరు పంచాయతీలో దీర్ఘకాలికంగా ఉన్న డ్రెయినేజీ సమస్యలను సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా పరిష్కరించా రు. పంచాయతీలో నిధులు లేకపోయినా తన సొంత సొమ్ము వెచ్చించారు. శుక్రవారం బీసీ కాలనీలో తలకొండవారి బజారు, ప్రధాన రహదారి మధ్య ఉన్న డ్రెయినేజీపై రూ. 80 వేల ఖర్చుతో పటిష్టంగా స్లాబ్ వేసే ప్రక్రియను పూర్తిచేశారు. అలాగే తూర్పు బీసీ కాలనీలో మరో డ్రెయినేజీపై రూ. 40 వేలు ఖర్చుతో స్లాబ్ వేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు. అలాగే అభివృద్ధికి నోచుకోని అంతర్గత రహదారులను ఇటీవల సర్పంచ్ గ్రావెల్‌తో అభివృద్ధి చేశారు. సర్పంచ్ పనితీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ తనయుడు, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్, ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావు, నియోజకవర్గ బీసీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్కా యోహాను, ఇంజనీరింగ్ అసిస్టెంట్ దివాకర్ తదితరులు పనులను పర్యవేక్షించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మండవల్లి జూలై 26 : ఏలూరు శంకర్ నేత్రాల యం ఆధ్వర్యంలో మండవల్లిలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని మండవల్లి సర్పంచ్ మెండా ఝాన్సీ సురేష్ శుక్రవారం ప్రారంభించారు. నేత్రాలయం డాక్టర్ దివ్య రవళి బృందం 148 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 43 మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నారు. మండవల్లి మాజీ సర్పంచ్ చిట్టిబాబు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు సుధాబత్తుల విజయ్‌కుమార్, లంకపల్లి భాస్కరరావు, టీడీపీ నాయకుడు ముళ్లపూడి సత్తిబాబు, శివాలయం కమిటీ చైర్మన్ కొల్ల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.